www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

**విలేకరులు కావలెను**


18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 139 | శనివారం 04.07.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

# రైతన్నలకు గుడ్ న్యూస్

## 5 ఎకరాల వరకు 'రైతుభరోసా' నిధులు విడుదల



### దళారుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా నిధుల జమ

### రాష్ట్రవ్యాప్తంగా రైతుల్లో హర్షం

- చిన్న, సన్నకారు రైతులకు రైతుభరోసా నిధుల జమ
- నాలుగో రోజుకు చేరిన రైతుభరోసా పంపిణీ
- 5 ఎకరాల లోపు రైతుల ఖాతాల్లోకి నిధులు
- డీబీటీ ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో నగదు
- వ్యవసాయ పెట్టుబడికి సకాలంలో ప్రభుత్వ సాయం
- విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు రైతులకు ఊరట
- విడతల వారీగా రైతుభరోసా నిధుల విడుదల
- దళారుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా నిధుల జమ
- రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం
- ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్న ప్రజా ప్రభుత్వం

02



# కేసీఆర్ కే సవాల్

## బీఆర్ఎస్ అప్పు అక్షరాలా రూ.8.21 లక్షల కోట్లు

### అబద్ధాల పునాదులపై పదేళ్ల పరిపాలన..

- హరీశ్ రావు అబద్ధాల ప్రచారం చేస్తున్నారన్న భట్టి
- బీఆర్ఎస్ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల అప్పు
- పదేళ్ల పాలన అబద్ధాల పునాదులపైనే సాగింది
- కేసీఆర్ అప్పులపై సమాధానం చెప్పాలి
- బీఆర్ఎస్ అప్పులకు రూ.2.08 లక్షల కోట్లు చెల్లించాం
- అప్పుల రీ-స్ట్రక్చరింగ్‌తో వడ్డీ భారం తగ్గింది
- ప్రజా సంక్షేమాన్ని ఆపకుండా ముందుకెళ్తున్న ప్రభుత్వం
- ఉనికి కోసం బీఆర్ఎస్ నేతల హడావుడి
- సింగరేణిని సంక్షోభంలోకి నెట్టింది బీఆర్ఎస్
- బొగ్గు మాయంపై విజిలెన్స్ విచారణకు ఆదేశాలు
- కొత్త కోల్ బ్లాక్ల కోసం కేంద్రంతో చర్చలు
- సింగరేణి కార్మికుల ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం

03

### వడ్డీల భారమే రూ.2 లక్షల కోట్లు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాజీ మంత్రి హరీశ్ రావు పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచిత విధానాలు, అప్పుల కుప్పలపై శ్వేతపత్రం తరహాలో సంచలన నిజాలను వెల్లడించారు. తాము చేసిన అప్పులను, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్, హరీశ్ రావు ఇద్దరూ ప్రజా ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగుతున్నారని మండిపడ్డారు.

**అబద్ధాల పునాదులపై పదేళ్ల పరిపాలన..**

"హరీశ్ రావు గతంలో ఆర్థిక మంత్రిగా పనిచేశాననే విషయం మరిచిపోయి మాట్లాడుతున్నారు. సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాటు అబద్ధాల పునాదులపైనే పరిపాలన సాగించింది" అని భట్టి విక్రమార్క విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన మొత్తం అప్పు అక్షరాలా రూ. 8.21 లక్షల కోట్లు అనీ, ఇందులోనే గత ప్రభుత్వం చెల్లించకుండా వదిలి వెళ్లిన వేల కోట్ల బకాయిలు కూడా ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ భారీ అప్పులపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్....

# ప్రాణాలతో చెలగాటం..

## వర్షాకాలంలో వాగు దాటేందుకు ఆదివాసీల అవస్థలు.!

- ములుగు కలిపాక గ్రామంలో వర్షాకాల కష్టాలు
- జిన్నెల వాగు దాటేందుకు మానవ హారంగా గ్రామస్థులు
- ఆసుపత్రి, నిత్యావసరాల కోసం ప్రాణాలకు తెగింపు
- బోటు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

03



# జూపల్లి రాజీనామా చేయాలి..

## మల్లన్నసాగర్ కృషి కేసీఆర్‌దే

### బీఆర్ఎస్ రోడ్డెక్కితే తప్ప ప్రభుత్వం స్పందించడం లేదు



రూ.10 వేల కోట్ల అప్పు ఎక్కడికి పోయింది?

### ఓట్ల తొలగింపు కుట్రలను తిప్పికొట్టాలి

- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్ర విమర్శలు
- జూపల్లి వ్యాఖ్యలు సెల్ఫ్ గోల్ అయ్యాయి
- రూ.10 వేల కోట్ల అప్పు ఎక్కడికి పోయింది?
- అప్పుల లెక్కలపై సీఎం, మంత్రుల మధ్యే విభేదాలు
- సంగమేశ్వర-బసవేశ్వర ప్రాజెక్టులకు వెంటనే నిధులు ఇవ్వాలి
- సింగూరు ప్రాజెక్టు మరమ్మతులు తక్షణమే చేపట్టాలి
- బీఆర్ఎస్ ఉద్యమిస్తేనే ప్రభుత్వం స్పందిస్తోంది
- అసైన్డ్ భూముల లాక్కోవడంపై కాంగ్రెస్‌పై ఆగ్రహం
- మేనిఫెస్టో హామీలన్నీ విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- సంగారెడ్డి అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటోంది

03



# మూడు షిఫ్టుల్లో పనులు..

## నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- రాష్ట్రవ్యాప్తంగా అద్దంలాంటి రోడ్ల నిర్మాణమే లక్ష్యం
- రూ.13 వేల కోట్లతో 6,092 కి.మీ హ్యామ్ రోడ్లు
- జూలైలోనే 10 హ్యామ్ ప్యాకేజీల పనుల ప్రారంభం
- 2027 డిసెంబర్ నాటికి కొత్త హైకోర్టు సిద్ధం
- మంచి రోడ్డు.. ప్రగతికి సూచిక : కోమటిరెడ్డి

02

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్టుల్లో టెక్నికల్ నాలెడ్జ్ ఉండి, మనసుపెట్టి పనిచేసే కమిట్మెంట్ ఉన్న ఇంజినీర్లను నియమించాలని మంత్రి సూచించారు. ఈ వారం నుండే నిర్మాణం జరుగుతున్న ప్రాంతాల్లో ఆకస్మిక సైట్ విజిట్స్ చేస్తానని.. పనుల పురోగతిలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తన దృష్టికి వస్తే, ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోనని, కఠిన చర్యలు తప్పవని సున్నితంగా హెచ్చరించారు. బాసర, భద్రాచలం ఆలయ నిర్మాణ పనుల పురోగతి, గోదావరి పుష్కరాల కోసం ఆర్ అండ్ బీ ఏర్పాట్లపై మంత్రి ఆరా తీశారు. సంబంధిత ఆయా శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఆర్ అండ్ బీ తరుపున నిర్మాణ పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకొని పని చేయాలని సూచించారు.




### కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటే

# తెలంగాణలో.. డబుల్ ఇంజన్ సర్కార్

- ఫోన్ ట్యాపింగ్ కేసులో జాప్యం ఎందుకు?
- అభివృద్ధికి 22 వేల కోట్లు తీసుకొచ్చా
- సింగరేణిలో బొగ్గు మాయంపై విచారణ జరిపించాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్

02

తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో డబుల్ ఇంజన్ సర్కార్ వస్తుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.



# రైలు కిందపడి దంపతుల ఆత్మహత్య!

- మేడ్చల్: ఘట్కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో దంపతుల ఆత్మహత్య
- రైలు కిందపడి దంపతులు శిరీష, రవికుమార్ ఆత్మహత్య
- మృతులు మహబూబాబాద్ జిల్లా చెన్నారావుపేట మం. పాపాయిపేట వాసులు

05



# కోడిగుడ్డు అ'ధర'హో!

### హోటళ్లు, బేకరీలపై ధరల పెరుగుదల ప్రభావం

**గత 25 ఏళ్లలో ఇంత ధరలు చూడలేదు: వ్యాపారులు**

- ఆకాశాన్నంటుతున్న కోడిగుడ్ల ధరలు
- ఎండల ప్రభావంతో తగ్గిన గుడ్ల ఉత్పత్తి
- హోల్‌సేల్ మార్కెట్‌లో భారీగా పెరిగిన ధరలు
- కోళ్ల మరణాలతో సరఫరాకు తీవ్ర అంతరాయం
- గుడ్డు ధర రూ.8కు చేరడంతో వినియోగదారుల ఆందోళన
- హోటళ్లు, బేకరీలపై ధరల పెరుగుదల ప్రభావం
- కూరగాయల తర్వాత గుడ్ల ధరలూ భారంగా మారాయి
- డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా లేక ధరల పెరుగుదల
- సామాన్యులకు గుడ్డు కూడా అందని ద్రాక్షగా మారింది

05

రిటైల్‌లో రూ.7 నుంచి రూ.8, హోల్‌సేల్‌లో రూ.6. 83 పైసలు

# మూడు షిఫ్టుల్లో పనులు..

## నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆర్అండ్బీ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు పనుల పురోగతిపై సచివాలయంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆ శాఖ ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్ అండ్ బీలోని విభాగాల వారీగా పనుల పురోగతిపై కూలంకషంగా చర్చించిన మంత్రి, చేపట్టిన కీలక పనులు ఏ దశల్లో ఉన్నాయో అధికారులను ఆరా తీశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో "న భూతో న భవిష్యత్" రీతిలో రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణానికి సంకల్పించామని, అందులో భాగంగా జూన్ 28న నల్లగొండ జిల్లా కనగల్ వేదికగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్ర హ్యామ్ రోడ్ల పనుల పైలాన్ ఆవిష్కరణ చేసుకుని, పనులు ప్రారంభించామని మంత్రి పేర్కొన్నారు. రానున్న రెండేళ్లలో రాష్ట్రంలో ఏ మూలన చూసినా నాణ్యమైన ఆర్ అండ్ బీ డబుల్ రోడ్లు వినియోగంలోకి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. "మంచి రోడ్డు - ప్రగతికి సూచిక" అని తాను బలంగా విశ్వసిస్తానని, దీంతో పల్లె పట్టణాలకు కనెక్టివిటీ పెరిగి, గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తె స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు.మొదటి ఫేజ్‌లో సుమారు 13 వేల కోట్లతో 6092 కి.మీ రోడ్ల పనులు 34 ప్యాకేజీల్లో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనుండగా.. ఈ జూలై నెలలోనే 10 ప్యాకేజీల పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్యాకేజ్-2లో సుమారు రూ.155 కోట్ల అంచనా వ్యయంతో 42కి.మీ పొడవుగల నల్లగొండ-మహబూబ్ నగర్ డబుల్ రోడ్డు పనులు ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో పనుల్లో వేగం పెంచాలన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు ఆశించిన స్థాయిలో లేవని, అయినా.. వర్షాకాలం పూర్తి అయిన తర్వాత మూడు షిఫ్టుల్లో(రాత్రి వేళల్లో కూడా) రోడ్ల నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. రోడ్ల నిర్మాణం కోసం నిష్ణాతులై, నిరంతరం ఫీల్డ్‌లో ఉండే ఇంజినీర్లను ఎంపిక చేసి, ప్యాకేజీల వారిగా పనుల బాధ్యతలు అప్పజెప్పాలని, పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయించడం చీఫ్ ఇంజినీర్ల బాధ్యతేనని మంత్రి స్పష్టం చేశారు. ఈనెల 6న కరీంనగర్ జిల్లాలో చేపట్టే హ్యామ్, CRF రోడ్ల పనులకు ఆ జిల్లా మంత్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. అందుకు సంబంధిత ఏర్పాట్లు చూడాలని అధికారులకు మంత్రి ప్రత్యేకంగా ఆదేశించారు.

**2027 డిసెంబర్‌లో కొత్త హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి ప్రారంభం..**

రాజేంద్ర నగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నూతన హైకోర్టు భవనం, జడ్జిల నివాస సముదాయ భవనాల నిర్మాణాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరగాలని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 16% పనులు పూర్తయ్యాయని అధికారులు వివరించగా.. మూడు షిఫ్టుల్లో నిర్మాణ పనులు జరగాలని, అందుకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచి, నిర్మాణ సంస్థతో సమన్వయం చేసుకుంటూ పనుల్లో వేగం పెంచాలని మంత్రి వారిని ఆదేశించారు. అక్కడ ఆర్ అండ్ బీ తరుపున నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్న ఇంజినీర్ల సంఖ్యను పెంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 డిసెంబర్ నాటికి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అట్లాగే ఉస్మానియా జనరల్ ఆసుపత్రి పనుల్లో ఇంకా వేగం పెరగాలని, ఇది కూడా డిసెంబర్ 2027 వరకు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. సనత్ నగర్ టిమ్స్ ప్రారంభానికి సిద్ధం అయిందని, అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్, నిమ్స్ విస్తరణ, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మాణ పనులు వేగవంతం చేసి అతి త్వరలో ప్రజలకు అందుబాటులోకి వచ్చే విధంగా పని చేయాలని అధికారులను ఆదేశించారు.

**ఈ ప్రాజెక్టుల్లో మనసుపెట్టి పనిచేసే ఇంజినీర్లను పెట్టండి..**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్టుల్లో టెక్నికల్ నాలెడ్జ్ ఉండి, మనసుపెట్టి పనిచేసే కమిట్మెంట్ ఉన్న ఇంజినీర్లను నియమించాలని మంత్రి సూచించారు. ఈ వారం నుండే నిర్మాణం జరుగుతున్న ప్రాంతాల్లో ఆకస్మిక సైట్ విజిట్స్ చేస్తానని.. పనుల పురోగతిలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తన దృష్టికి వస్తే, ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోనని, కఠిన చర్యలు తప్పవని సున్నితంగా హెచ్చరించారు. బాసర, భద్రాచలం ఆలయ నిర్మాణ పనుల పురోగతి, గోదావరి పుష్కరాల కోసం ఆర్ అండ్ బీ ఏర్పాట్లపై మంత్రి ఆరా తీశారు. సంబంధిత ఆయా శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఆర్ అండ్ బీ తరుపున నిర్మాణ పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకొని పని చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఈఎన్సీ జయ భారతి, అన్ని విభాగాల సీఈలు బీవీ రావు, రాజేశ్వర్ రెడ్డి, ధర్మారెడ్డి, వసంత్ నాయక్, వనజ, రాజేందర్, నర్సింగ్ రావు పలువురు ఆర్ అండ్ బీ ఇంజినీర్లు పాల్గొన్నారు.

# చినుకుల జాడ కనిపించడం లేదు

**మహబూబాబాద్,ఫ్లాష్ ఇండియా :** రోజులు గడుస్తున్నాయి.. కార్తెలు మారిపోతున్నాయి.. చినుకుల జాడ కనిపించడం లేదు.. ఆశగా ఆకాశం వైపు ఎదురు చూస్తున్న రైతులకు వరుణదేవుడు కరుణించడం లేదు. ఏరువాక పౌర్ణమి తెలంగాణ రైతులకు వ్యవసాయ పండుగే.! సాధారణంగా జేష్టపౌర్ణమి రోజున నూతన వ్యవసాయ సీజన్‌కు శ్రీకారం చుట్టడం ఆనవాయితీ. ఈ సారి వానలు కురవకపోవడంతో వర్షాకాలపు వ్యవసాయ పనులకు నాంది పలికే పౌర్ణమి వెలవెలబోయింది. ప్రకృతి ప్రకోపమా? లేక మానవ తప్పిదమా! ఏదేమైనా కానీ., ప్రస్తుతం వర్షాకాలంలో వర్షాలు లేక సాగు ముందుకు సాగడం లేదు. జూన్ నెల మాసంలో సాధారణ వర్షపాతం కంటే 20 శాతం లోటు వర్షాలు కురిశాయి. దాంతో మహబూబాబాద్ జిల్లాలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు కేవలం 70 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు పడగా, ఇతర పంటలు 42,494 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి.

**వర్షపాతం ఇలా..**

జూన్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఈ నెల రోజుల కాలంలో గతేడాది సగటున 91.6 మిమ్మీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, ఈ ఏడాది జూన్ మాసంలో 139.8 మిమ్మీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఈ రోజు వరకు 111.6 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం కంటే సగటున 20 శాతం లోటు వర్షం కురిసింది. మహబూబాబాద్ జిల్లాలోని పది మండలాలైన కొత్తగూడ, గంగారం, కురవి, మహబూబాబాద్, గూడూరు, కేసముద్రం, నెల్లికుదురు, చిన్నగూడూరు, దంతాలపల్లి, ఇనుగుర్తిలలో అతితక్కువ వర్షం కురిసింది. ఐదు మండలాలైన బయ్యారం, డోర్నకల్, నర్సింహులపేట, తొర్రూరు, సీరోలులలో సాధారణ వర్షపాతం నమోదైంది. మూడు మండలాలైన గార్ల, మరిపెడ, పెద్దవంగర అధికంగా వర్షం కురిసింది. సగటున జిల్లాలో 139.8 మిల్లీమీటర్ల వర్షం కురియాల్సి ఉండగా, 111.6 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. సాధారణ వర్షపాతంతో పోలిస్తే 20 శాతం వర్షపాతం లోటు నమోదైంది. దీంతో రైతాంగానికి వర్షాల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు.

**నెమ్మదించిన సాగు..**

జిల్లా వ్యాప్తంగా 4,46,350 ఎకరాల్లో పంటల సాగు చేస్తారని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేయగా వర్షాలు లేక పంటల సాగు నెమ్మదించింది. గత జూన్ నెలలో 42,494 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేశారు. 35,015 ఎకరాల్లో ఇప్పటి వరకు పత్తి సాగు చేశారు. జొన్నలు 36 ఎకరాల్లో, వరి 70 ఎకరాల్లో, మొక్కజొన్న 5,297 ఎకరాల్లో, కందులు 137 ఎకరాల్లో, పెసళ్లు 1,930 ఎకరాల్లో, మినుములు 4 ఎకరాల్లో, వేరుశనగ 5 ఎకరాల్లో సాగు చేస్తుండగా 32,650 ఎకరాల్లో వరి నారుపోసుకుని నాట్లు వేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. ప్రతీ రోజు సాయంత్రం కాగానే ఆకాశంలో నల్లటి మేఘాలు కమ్ముకుని దోబూచులాడుతూ.. వెళ్లిపోవడంతో రైతాంగం వర్షాలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు.

**తగ్గని ఉష్ణోగ్రతలు..**

వానాకాలం ప్రవేశించి జూన్ నెల గడిచినప్పటికీ వర్షాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఎండలు దంచికొడుతూనే ఉన్నాయి. జూన్ 23 వరకు 40 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రెండోవారంలో 42.7 వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ వారం రోజుల్లో 38.3 డిగ్రీల వరకు ఎండలు నమోదవుతున్నాయి. వర్షాలు పడక రైతులు అల్లాడిపోతున్నారు.

**చెరువుల్లో ఇలా..**

మహబూబాబాద్ జిల్లాలో వర్షాలేక చెరువులన్నీ వెలవెలబోతున్నాయి. దాంతో పాటు ఆకేరు, మున్నేరు, పాకాల వాగుల్లో కూడా నీరులేక రాళ్లుతేలాయి. జిల్లాలో 1,590 చెరువులు ఉండగా అందులో 1,571 చెరువుల్లో 0-25 శాతం వరకు నీరు ఉంది. వీటిలో బాగా నీరులేక దర్శనమిస్తున్నాయి. పెద్దవంగర మండలంలోని 17 చెరువుల్లో 25-50 శాతం వరకు నీరు చేరగా, తొర్రూరు మండలంలో రెండు చెరువుల్లో మాత్రం 50-75 శాతం వరకు నీరు చేరిందని నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. ఒక్క పెద్దవంగర, తొర్రూరు మండలాల చెరువుల్లో నీరు చేరుతుండడంతో ఆ ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# సాయంత్రమే ప్రెస్‌క్లబ్‌కు వస్తా..

- బీఆర్ఎస్ అప్పులపై జూపల్లి బహిరంగ సవాల్
- నిరూపిస్తే మంత్రి, ఎమ్మెల్యే పదవులకు రాజీనామా
- అప్పుల లెక్కల్లో కేటీఆర్, హరీశ్ మాటలు మారుతున్నాయి
- రూ.8.21 లక్షల కోట్ల అప్పులు, బకాయిలు: జూపల్లి
- కేసీఆర్ కుటుంబానికి సీల్డ్ కవర్ లేఖలు
- రాతపూర్వక సమాధానం ఇవ్వాలని గులాబీ నేతలకు సవాల్
- కార్పొరేషన్ల అప్పులకు బీఆర్ఎస్ బాధ్యత తప్పదు
- కాళేశ్వరం, మిషన్ భగీరథ అప్పులపై తీవ్ర విమర్శలు
- ఆత్మగౌరవం కోసం పదవులు వదిలిన చరిత్ర నాది



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** గత బీఆర్ఎస్ ప్రభుత్వ అప్పుల చిట్టాపై రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గులాబీ నేతలకు బహిరంగ సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అప్పులు, బకాయిలపై తాను అన్న మాటలకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని, తన ఆరోపణలు అబద్ధమని రుజువు చేస్తే మంత్రి పదవితో పాటు ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. శుక్రవారం సీఎల్పీ మీడియా సెంటర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు బీఆర్ఎస్ అగ్రనేతలపై తీవ్ర-స్థాయిలో విరుచుకుపడ్డారు.

**అప్పులపై కేటీఆర్, హరీష్ రావులవన్నీ పూటకో మాట..**

బీఆర్ఎస్ నేతల తీరు 'ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ డెడ్' అన్నట్లుగా ఉందని మంత్రి జూపల్లి ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో అప్పుల లెక్కలపై కేటీఆర్, హరీష్ రావు ఇద్దరూ పూటకో రకంగా మాట్లాడారని మండిపడ్డారు. తాము చేసిన అప్పులు రూ.3.17 లక్షల కోట్లు అని ఒకసారి, రూ.3.85 లక్షల కోట్లు అని మరోసారి కేటీఆర్ చెప్పారు. హరీష్ రావు చూస్తే.. రూ.4.26 లక్షల కోట్లని ఒకసారి, రూ.4.17 లక్షల కోట్లని మరోసారి నెంబర్లు మార్చారు. అసలు వీరు అసెంబ్లీలో మాట్లాడిన దానికి కట్టుబడి ఉన్నారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో అప్పులు, బకాయిలు కలిపి అక్షరాలా రూ.8,21,651 కోట్లు చేశారని మంత్రి స్పష్టం చేశారు.

**కేసీఆర్ కుటుంబానికి సీల్డ్ కవర్ లేఖలు..**

అప్పుల లెక్కలపై వాస్తవాలు తేల్చడానికి కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులకు తాను రాతపూర్వకంగా లేఖ రాస్తున్నట్లు మంత్రి జూపల్లి వెల్లడించారు. "ఈ లేఖను వాట్సాప్, ఈమెయిల్, స్పీడ్ పోస్ట్ ద్వారా సీల్డ్ కవర్లలో పంపుతున్నా. నేను చెప్పిన లెక్కలకు కట్టుబడి రాజీనామాకు సిద్ధమయ్యా. మరి నేను చెప్పింది అబద్ధమైతే మీరు ఏం చేస్తారో రాతపూర్వకంగా చెప్పాలి? ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తారా లేక కేసీఆర్ పార్టీని రద్దు చేస్తారా? అని సవాల్ విసిరారు. కార్పొరేషన్ల ద్వారా తెచ్చిన అప్పులతో మాకు సంబంధం లేదనడం బీఆర్ఎస్ నేతల సిగ్గుమాలినతనానికి నిదర్శనమన్నారు. కాళేశ్వరం, పాలమూరు, మిషన్ భగీరథ పేరుతో తెచ్చిన అప్పులను ప్రజలు, రైతుల నెత్తిన రుద్దాలని చూశారా అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

**పాలమూరు పౌరుషం ఏంటో చూపిస్తా..**

తనకు పదవుల కంటే ఆత్మగౌరవమే ముఖ్యమని, గతంలో ఆత్మగౌరవం కోసమే ప్రభుత్వ ఉద్యోగానికి, ఆ తర్వాత మంత్రి పదవికి కూడా రాజీనామా చేసిన చరిత్ర తనదని జూపల్లి గుర్తుచేశారు. "మిస్టర్ హరీష్ రావు, కేటీఆర్.. నాటి తెలంగాణ ఉద్యమంలో పాలమూరు " పౌరుషం, చీము, నెత్తురు ఉండబట్టి మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలేశాను. కేసీఆర్‌కు కుడి భుజం, ఎడమ భుజం అని చెప్పుకునే మీరు ఉమ్మడి మహబూబ్ నగర్‌లో ఒక్క సీటు కూడా గెలిపించుకోలేకపోయారు. నేను రాజీనామా చేశాకే జిల్లాలో బీఆర్ఎస్‌కు 6 సీట్లు వచ్చాయి" అని దుయ్యబట్టారు. తాను అబద్ధాలు చెప్పే వ్యక్తిని కాదని, తోకముడిచే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.

**కూట్లో రాయి తీయలేనోడు.. ఏట్లో రాయి తీస్తాడట..**

బీఆర్ఎస్ అనాలోచిత ఆర్థిక విధానాలపై మంత్రి తీవ్ర విమర్శలు చేశారు. "కూట్లో రాయి తీయలేనోడు ఏట్లో రాయి తీస్తా అన్నట్లుగా కేటీఆర్, హరీష్ రావు తీరు ఉంది. ఎన్నికల ముందు ఔటర్ రింగ్ రోడ్డు లీజును అడ్డగోలుగా అమ్మి. ఆ వచ్చిన డబ్బుల్లో కేవలం రూ.5,800 కోట్లు మాత్రమే రైతు బంధు కింద చెల్లించారు" అని ఆరోపించారు.

కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా పారిపోతున్నారని, దమ్ముంటి మీడియా ముందుకు రావాలన్నారు. ఈ సాయంత్రం 5 గంటలకు తాను ప్రెస్‌క్లబ్‌కు వస్తున్నానని, బీఆర్ఎస్ నేతలకు దమ్ము, ధైర్యం, రోషం ఉంటే అక్కడికైనా వచ్చి చర్చలో పాల్గొనాలని, పాలమూరు పౌరుషమో.. కల్వకుంట్ల పౌరుషమో తేల్చుకుందామని మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు.

# తెలంగాణలో.. డబుల్ ఇంజన్ సర్కార్

**కరీంనగర్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో డబుల్ ఇంజన్ సర్కార్ వస్తుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ మరో వారం రోజుల్లో రూ.50కోట్ల యూడీఎఫ్ నిధులతో కరీంనగర్ లో రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించబోతున్నామని తెలిపారు. మరో 3 నెలల్లో అర్బన్ ఛాలెంజ్ స్కీం కింద కేంద్రం ఇచ్చిన రూ.840 కోట్ల నిధులతో కరీంనగర్ ను సుందరంగా తీర్చిదిద్దే పనులను ప్రారంభించబోతున్నామన్నారు. కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అందించిన 100 రోజుల్లోనే యూడీఎఫ్ నిధులను తీసుకొచ్చామన్నారు. కరీంనగర్ లో పార్కింగ్ సమస్య లేకుండా రూ.25 కోట్లతో శాశ్వత పరిష్కార పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు.

**పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి 22వేల కోట్లు**

ఎంపీగా ఎన్నికైనప్పటి టి నుంచి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.22 వేల కోట్లు తీసుకొచ్చానని తెలిపారు. రోడ్ల నిర్మాణం కోసమే రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తున్నం. దసరా నాటికి కరీంనగర్ వరంగల్ హైవే రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.. అతి త్వరలో కరీంనగర్ జగిత్యాల హైవే పనులను ప్రారంభిస్తామని, గన్నేరువరం బ్రిడ్జి నిర్మాణ పనులకు సైతం అతి త్వరలో శ్రీకారం చుట్టబోతున్నామని పేర్కొన్నారు.

**బిగ్ బాస్ షోను తలదన్నేలా..**

కాంగ్రెస్ భారత రాష్ట్రపతి నాయకుల డ్రామాలు బిగ్ బాస్ షోను తలదన్నేలా ఉన్నాయని కేంద్ర మంత్రి ఎద్దేవా చేశారు. వాళ్ల నాటకాలను చూసి జనం నవ్వుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ అవినీతి పార్టీలే అని.. ఆ రెండు పార్టీలను తెలంగాణ ప్రజలు ఎలిమినేషన్ చేయబోతున్నారని సంజయ్ తెలిపారు.

**ఫోన్ ట్యాపింగ్ కేసులో జాప్యం ఎందుకు?**

ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడిందని కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు పెట్టారని తెలిపారు. అయినా ఇంతవరకు చర్యలు ఎందుకు తీసుకోలేదని బండి ప్రశ్నించారు.. గత ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ ప్రత్యర్థులను వేధించడానికి వాళ్ల ఫోన్ నెంబర్లను కూడా ట్యాపింగ్ చేయించారు. ఈ కేసు విచారణను ఎప్పుడు పూర్తి చేస్తారు. బాద్యులను ఎప్పుడు అరెస్ట్ చేస్తారు.ఫోన్ ట్యాపింగ్ కేసు జాప్యం వెనుక కారణాలేమిటి అని ఆయన ప్రశ్నించారు. ఉపాధి హామీ కోసం దేశ వ్యాప్తంగా ఎనిమిది లక్షల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేశామని.. తెలంగాణలోనూ రూ.39 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. సింగరేణిలో బొగ్గు మాయంపై తక్షణ విచారణ జరి పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# రైతన్నలకు గుడ్ న్యూస్




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలోని అన్నదాతలకు ప్రజా ప్రభుత్వం తీపి కబురు అందించింది. యాసంగి/ వానకాలం పెట్టుబడి సాయానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'రైతుభరోసా' నిధుల విడుదల కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోంది. అర్హులైన రైతులందరికీ పెట్టుబడి సాయం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం నిధులను విడుదల చేస్తోంది. ఇందులో భాగంగా తాజాగా 5 ఎకరాల లోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతుల ఖాతాల్లోకి రైతుభరోసా నిధులను ప్రభుత్వం విడుదల చేసింది.

**నాలుగో రోజుకు చేరిన నిధుల పంపిణీ..**

రాష్ట్రవ్యాప్తంగా రైతుభరోసా నిధుల విడుదల కార్యక్రమం వరుసగా నాలుగో రోజుకు చేరింది. తక్కువ భూమి ఉన్న రైతులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ, విడతల వారీగా అకౌంట్లలో డబ్బులు జమ చేసే ప్రక్రియను వ్యవసాయ, ఆర్థిక శాఖలు ముమ్మరం చేశాయి. మొదటి రోజు ఒకటి, రెండు ఎకరాల లోపు ఉన్న రైతులతో ప్రారంభమైన ఈ ప్రక్రియ.. నిరంతరాయంగా సాగుతూ నేడు 5 ఎకరాల పరిమితి వరకు ఉన్న రైతులందరికీ వర్తింపజేశారు. నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకే (DBT ద్వారా) నగదు జమ అవుతుండటంతో రైతుల మొబైల్‌కు మెసేజ్‌లు వస్తున్నాయి.

**సకాలంలో పెట్టుబడి సాయం..**

వ్యవసాయ సీజన్ ప్రారంభమైన తరుణంలో, సకాలంలో పెట్టుబడి సాయం అందడంపై రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది. విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లకు ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడతాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో లాగా కాకుండా, ఎలాంటి దళారుల ప్రమేయం లేకుండా. నేరుగా తమ అకౌంట్లలోకే డబ్బులు రావడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం.. ఇచ్చిన మాట ప్రకారం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, మిగిలిన రైతులకు కూడా ఎలాంటి ఆటంకాలు లేకుండా రాబోయే రోజుల్లో నిధులు జమ అయ్యేలా అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారని సచివాలయ వర్గాలు వెల్లడించాయి.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# ఇష్టానుసారంగా మాట్లాడొద్దు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అప్పుల వివరాలపై సమగ్ర చర్చకు తాను సిద్ధంగా ఉన్నాయని మరోసారి మంత్రి జూపల్లి కృష్ణారావు , మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్‌లకు సవాలు విసిరారు. ఇవాళ గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7.3 లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు మీదనే స్పెషల్ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రూ.74 వేల కోట్ల అప్పు చేసిందని తెలిపారు. అప్పులపై తాను చేసిన వ్యాఖ్యలకు పూర్తిగా కట్టుబడి ఉన్నానని,. తాము అప్పులు చేయలేదని కేసీఆర్ చెప్పాలన్నారు. ఒకవేళ తాను చెప్పింది అబద్ధమైతే ఈ క్షణమే మంత్రి పదవితో పాటు ఎమ్మెల్యే సభ్యత్వానికి రాజీనామా చేసేందుకు సిద్ధమని ప్రటించారు.

**రాజీనామాకు ఇప్పటికీ కట్టుబడే ఉన్నా..**

ఇదే కేటీఆర్ , హరీశ్ రావు గతంలో రాష్ట్ర అప్పులపై వేర్వేలు లెక్కలు చెప్పారని ఫైర్ అయ్యారు. అందుకు సంబంధించి వివరాలను వాళ్లకు వాట్సాప్ ద్వారా పంపుతున్నానని తెలిపారు. బీఆర్ఎస్ తీరు ఆపరేషన్ సక్సెస్, పేషెంట్ డెడ్ అన్న చందంగా ఉందని సెటైర్లు వేశారు. ముందు తాను చెబుతున్న లెక్కలు తప్పు అని కేసీఆర్‌తో చెప్పించండి చూద్దాం అని గరం అయ్యారు.

**సిగ్గులేని మాటలు.. నేను మాట్లాడను**

'నేను సవాల్ చేసి పారిపోయానని.. కేటీఆర్, హరీశ్ రావు ఆరోపిస్తున్నారని, రాజీనామా సవాలుపై ఇప్పటికే కట్టుబడి ఉన్నా..రండి' ధ్వజమెత్తారు. సాయంత్రం సరిగ్గా 5 గంటలకు ప్రెస్‌క్లబ్ చర్చిద్దామని జూపల్లి సవాలు విసిరారు. ముఖ్యంగా రాష్ట్ర అప్పులపై కేటీఆర్, హరీశ్ రావు చెప్పింది తప్పని తేలితే ఎమ్మెల్యే పదవులకు, బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా అని మంత్రి జూపల్లి ప్రశ్నించారు. ముందు తన చరిత్ర ఏంటో తెలుసుకోవాలని, వాళ్ల లాగా సిగ్గులేని మాటలు మాట్లాడనని.. ఖబడ్దార్ ఇష్టానుసారంగా మాట్లాడొద్దని జూపల్లి కృష్ణారావు ఫైర్ అయ్యారు.

# కేసీఆర్ కే సవాల్

## బీఆర్ఎస్ అప్పు అక్షరాలా రూ.8.21 లక్షల కోట్లు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాజీ మంత్రి హరీశ్ రావు పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచిత విధానాలు, అప్పుల కుప్పలపై శ్వేతపత్రం తరహాలో సంచలన నిజాలను వెల్లడించారు. తాము చేసిన అప్పులను, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్, హరీశ్ రావు ఇద్దరూ ప్రజా ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగుతున్నారని మండిపడ్డారు.

**అబద్ధాల పునాదులపై పదేళ్ల పరిపాలన..**

"హరీశ్ రావు గతంలో ఆర్థిక మంత్రిగా పనిచేశాననే విషయం మరిచిపోయి మాట్లాడుతున్నారు. సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాటు అబద్ధాల పునాదులపైనే పరిపాలన సాగించింది" అని భట్టి విక్రమార్క విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన మొత్తం అప్పు అక్షరాలా రూ.8.21 లక్షల కోట్లు అనీ, ఇందులోనే గత ప్రభుత్వం చెల్లించకుండా వదిలి వెళ్లిన వేల కోట్ల బకాయిలు కూడా ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ భారీ అప్పులపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం చెప్పాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సేవాల్ విసిరారు.

**వడ్డీల భారమే రూ.2 లక్షల కోట్లు..**

గత ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా ప్రస్తుత ప్రభుత్వంపై పడుతున్న భారాన్ని భట్టి వివరించారు. బీఆర్ఎస్ తెచ్చిన అప్పులకు గానూ.. గడిచిన రెండున్నరేళ్లలోనే తాము అసలు, వడ్డీలు కలిపి రూ.2,08,061 కోట్లు చెల్లించాల్సి వచ్చిందని తెలిపారు. ఇంతటి భారీ అప్పులు కడుతూ కూడా, ప్రజా ప్రభుత్వం ఎక్కడా వెనకడుగు వేయకుండా సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యధిక వడ్డీలకు తెచ్చిన అప్పులను ప్రస్తుతం తాము రీస్ట్రక్చరింగ్ చేయిస్తున్నామని.. దీనివల్ల ఏడాదికి కట్టాల్సిన వడ్డీ భారాన్ని రూ.34 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్లకు తగ్గించగలిగామని వివరించారు. కేసీఆర్, హరీశ్ రావులకు గతం లేదు.. భవిష్యత్ లేదు. అందుకే ఉనికి చాటుకోవడానికి ఇప్పుడు హడావిడి పెంచారు" అని ఎద్దేవా చేశారు.

**బొగ్గు మాయంపై విజిలెన్స్ విచారణ..**

సింగరేణి సంస్థను బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు సంక్షోభంలోకి నెట్టిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. "బీఆర్ఎస్ నేతలు సింగరేణి ప్రాంతాల్లో తిరుగుతూ మళ్లీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. పదేళ్ల కాలంలో సింగరేణిలో కనీసం ఒక్క కొత్త బ్లాక్‌నైనా అందుబాటులోకి తెచ్చారా? ఇన్నాళ్లూ కొత్త బ్లాక్లు రాకుండా అడ్డుకున్నదే బిఆర్ఎస్ నేతలు" అని దుయ్యబట్టారు. సింగరేణి నుంచి కేజీ బొగ్గు కూడా బయటకు వెళ్లే అవకాశం లేదని చెప్తూనే.. గతంలో జరిగిన బొగ్గు మాయం ఆరోపణలపై తాము సీరియస్‌గా ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. దీనిపై ఇప్పటికే సింగరేణి విజిలెన్స్ డైరెక్టర్‌కు పూర్తిస్థాయి విచారణ జరపాలని ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. కొత్త కోల్ బ్లాక్లను సాధించుకునేందుకు ప్రస్తుతం తాము కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని, సింగరేణిని కాపాడుకుంటూనే కార్మికుల ప్రయోజనాలను రక్షిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు.

# పోలీసులతో అరెస్ట్ చేయించేంత పిరికివాళ్లం కాదు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** చర్చకు సై అని.. పోలీసులతో అరెస్ట్ చేయించేంత పిరికివాళ్లం తాము కాదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గన్ పార్క్ వద్దకు రమ్మని, ఆ తర్వాత ఫోన్ లిఫ్ట్ చేయలేదని హరీష్ రావు ఆరోపిస్తున్నారన్నారు. గన్ పార్క్ వద్దనున్న గోషా మహల్, మలక్ పేటలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఉంటే.. అక్కడికి వెళ్లామని తెలిపారు. పదే పదే తాము ఫోన్ లిఫ్ట్ చేయలేదంటున్న హరీష్ రావు... ఆయనే రాహుల్ కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేస్తారా? అని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ లు కిందిస్థాయి నుంచి వచ్చిన వ్యక్తులని తెలియదా అని నిలదీశారు. పదేళ్లుగా బీఆర్ఎస్ తో కుమ్మక్కై లాభపడిన చెంచా



గాళ్లు వచ్చి.. ఏది చెప్తే అది నమ్మి ఇష్టానుసారం మాట్లాడితే చెల్లదన్నారు. గురుకులాల్లో మొత్తం టెండర్లు రూ.1142 కోట్లు అయితే.. రూ.2 వేల కోట్ల స్కామ్ ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. చేతిలో పేపర్లు పట్టుకుని తిరిగినంత మాత్రాన ప్రతిపక్షాల ఆరోపణలు నిజమైపోవన్నారు. విద్యార్థుల భవిష్యత్ బాగుండాలనే గురుకులాలను సెంట్రలైజ్ చేశామని తెలిపారు.

# ప్రాణాలతో చెలగాటం..

**తిప్పాపురం,ఫ్లాష్ ఇండియా :** వర్షాకాలం వచ్చిందంటే చాలు ములుగు జిల్లాలోని అటవీ గ్రామాలకు కష్టాలు మొదలవుతాయి. ముఖ్యంగా వెంకటాపురం మండలం తిప్పాపురం గ్రామపంచాయతీ పరిధిలోని 'కలిపాక' ఆదివాసీ గ్రామ ప్రజల పరిస్థితి వర్ణనాతీతంగా మారుతోంది. నిత్యవసర సరుకులు తెచ్చుకోవాలన్నా, అత్యవసర వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లాలన్నా ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వాగు దాటాల్సిన దుస్థితి నెలకొంది. చుట్టూ అడవి, మరోవైపు ఉధృతంగా ప్రవహించే వాగుల మధ్య ఈ గ్రామం వర్షాకాలంలో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి ఒక ద్వీపంగా మారుతోంది.

**జిన్నెల వాగు ఉధృతి.. గొలుసుకట్టుగా దాటుతున్న వైనం**

కలిపాక గ్రామ సరిహద్దుల్లో ప్రవహించే 'జిన్నెల వాగు' ఉధృతంగా ప్రవహిస్తున్నప్పటికీ, పొట్టకూటి కోసం , నిత్యవసరాల కోసం మహిళలు, గ్రామస్థులు దాటక తప్పడం లేదు. తాజాగా సుమారు 15 మంది గ్రామానికి చెందిన మహిళలు, పురుషులు ఒకరినొకరు గట్టిగా పట్టుకుంటూ మానవ హారంగా (గొలుసుకట్టుగా) మారి ప్రాణాలకు తెగించి ఈ వాగును దాటారు. ఒక్క అడుగు తప్పటడుగు పడినా వరద ప్రవాహంలో కొట్టుకుపోయే ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ, వేరే మార్గం లేక ప్రతిరోజూ ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలు చేయాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బోటు ఏర్పాటు చేయాలని గ్రామస్థుల విజ్ఞప్తి**

వర్షాకాలం మొత్తం ఇదే పరిస్థితి కొనసాగుతుందని, అనారోగ్యం బారిన పడితే ఆసుపత్రికి వెళ్లలేక నరకయాతన అనుభవిస్తున్నామని ఆదివాసీ ప్రజలు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి కనీసం ఈ వర్షాకాలం సీజన్ ముగిసేవరకైనా ప్రయాణానికి ఒక బోటు (పడవ) అందుబాటులో ఉంచాలని వేడుకుంటున్నారు. అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడుకోవడానికి ఈ బోటు ఎంతగానో ఉపయోగపడుతుందని, తమ కష్టాలను గుర్తించి ప్రభుత్వం తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని కలిపాక గ్రామస్థులు కోరుతున్నారు.

# కాలె యాదయ్యకు హటావో కాంగ్రెస్ బచావో..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యకు నిరసన సెగ తగిలింది. కాలె యాదయ్యకు హటావో కాంగ్రెస్ పార్టీకి బచావో అంటూ నియోజకవర్గంలోని దాదాపు వందమంది కార్యకర్తలు గాంధీభవన్ వద్ద ఆందోళన చేపట్టారు. కాలె యాదయ్య ఏ పార్టీలో ఉన్నాడో కూడా చెప్పకుండా, కనీసం కాంగ్రెస్ కండువా కూడా కప్పుకోవడంలేదని అన్నారు. గత ప్రభుత్వంలో భుజాలు కాయలుకాసినా కాంగ్రెస్ పార్టీ జెండాను మోశామని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అనేక నిర్భంధాలు, రౌడీ షీట్ కేసులు ఎదుర్కొన్నామని చెప్పారు. ఆనాడు బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యేగా ఉన్న కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై ఎన్నో అక్రమ కేసులు పెట్టారని మండిపడ్డారు.ఎన్నో దాడులు చేశారని అన్నారు. ఈ రోజు కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతో పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పై నమ్మకం ఉందని యాదయ్యను పార్టీ నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. వారికి ఏం సమాచారం ఇస్తున్నాడో కానీ పార్టీ కండువా కప్పుకోవడం లేదని అన్నారు. ఇదిలా ఉంటే కాలె యాదయ్య గతంలో బీఆర్ఎస్ పార్టీలో ఉన్నారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన తరవాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ క్రమంలో ఆయనకు వ్యతిరేకంగా సొంత నియోజకవర్గంలోనే నిరసన సెగలు తగులుతున్నాయి.

# నష్టాల నుంచి గట్టెక్కేలా సర్కార్ ప్లాన్!

## సింగరేణికి కొత్త ఊపిరులు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ఆర్థిక, పారిశ్రామిక రంగానికి ఊపిరిగా నిలిచిన సింగరేణి సంస్థ గత పదేళ్లలో దారుణంగా దెబ్బతిన్నది. 137 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఈ ప్రభుత్వ రంగ సంస్థ, స్వరాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయికి ఎదగాల్సింది పోయి వ్యూహాల లోపంతో గత పదేళ్లుగా తీవ్రంగా నష్టపోయింది. బొగ్గు మైనింగ్‌లో శతాబ్దానికి పైగా అనుభవం ఉన్నప్పటికీ, రాష్ట్రంలో కొత్త బొగ్గు బ్లాక్‌లు దక్కకుండా నాటి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అడ్డుపడిందనే ఆరోపణలున్నాయి. ఫలితంగా నేడు ప్రభుత్వ రంగ సంస్థలైన జెన్‌కో, సింగరేణి విస్తరణ పూర్తిగా స్తంభించిపోయింది.

**సింగరేణిపై ఆంక్షలు..**

కేంద్ర ప్రభుత్వం 2015లో దేశంలో బొగ్గు గనుల కేటాయింపునకు వేలం విధానాన్ని తెచ్చినప్పుడు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించిందనే ఆరోపణలున్నాయి. సింగరేణికి ఒడిశాలో కేటాయించిన అత్యంత విలువైన బొగ్గు బ్లాక్‌ల విషయంలో నాటి పాలకులు ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేశారని, దీనివల్ల సింగరేణి సంస్థ తీవ్ర నష్టాన్ని మూటగట్టుకుంటూ ఒడిశాలోని కీలకమైన జేఎంటీ-3 బ్లాక్‌ను, నైనపల్లి బ్లాక్-3ను కోల్పోవాల్సి వచ్చిందని అధికార పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. కోయగూడెం బ్లాక్‌లో 119.60 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలుండగా.. దాదాపు 14ఏళ్ల పాటు గని కార్యకలాపాలను కొనసాగిచేందుకు అవకాశం ఉండేది. ఏడాదికి 5 మిలియన్ టన్నుల బొగ్గును వెలికితీసే అవకాశం ఉంటుంది. ఇక సత్తుపల్లి బ్లాక్‌లో 69.65 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్నాయి. 8ఏళ్లపాటు ఏటా 4మిలియన్ టన్నుల చొప్పున బొగ్గును తీసేందుకు అవకాశం ఉండేది. ఈ రెండింటిని కోల్పోవడం సింగరేణిపై భారీ ప్రభావాన్ని చూపింది. ఈ రెండు బ్లాక్‌లను నాటి ప్రభుత్వం ప్రైవేట్‌పరం అయ్యేలా రూపాంతరం చెందించడంతో ఇప్పటివరకు అక్కడ మైనింగ్ కార్యకలాపాలు మొదలు కాలేదు.

**పాత గనులపై భారం..**

రాష్ట్రం ఏర్పడే నాటికి సింగరేణిలో 48 గనులు, సుమారు 59 వేల మంది ఉద్యోగులు ఉండేవారు. అయితే గత 10ఏళ్ల కాలంలో (2014-2023) కొత్త బొగ్గు బ్లాక్‌లు సాధించకపోవడంతో, ప్రస్తుతం ఉన్న గనుల నుంచే సామర్థ్యానికి మించి ఉత్పత్తి చేయాల్సి వస్తోంది. దీనివల్ల పాత గనుల్లో నిల్వలు హరించుకుపోయి 2022 డిసెంబర్ నాటికి గనుల సంఖ్య 48 నుంచి 40కు పడిపోయింది. రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 2014లో 5,661 మెగావాట్లు ఉండగా, 2026 నాటికి అది 18,548 మెగావాట్లకు చేరింది. డిమాండ్‌కు తగ్గట్టుగా కొత్త గనులకు లీజులు తీసుకోకపోవడంతో అంతర్గత బొగ్గు కొరత ఏర్పడింది. కొత్తగా 4 వేల మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్లు ప్రారంభించినా, వాటికి అవసరమైన బొగ్గు నిల్వలకు ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో జెన్‌కో ప్లాంట్లపై తీవ్ర ప్రభావం పడింది.

**పునరుజ్జీవనం దిశగా..**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణి పునరుజ్జీవనానికి విప్లవాత్మక అడుగులు పడ్డాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక నిఘా పెట్టి కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనపై దృష్టి పెట్టారు. సింగరేణి విస్తరణకు కీలకమైన శ్రావణపల్లి బ్లాక్-2 ను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. అలాగే గతంలో ప్రైవేట్ పరమైన కాలయాపన, సత్తుపల్లి గనులను తిరిగి సింగరేణి పరిధిలోకి తేవడానికి చర్యలు చేపట్టారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలవడంతో 32 గనుల చొప్పున బ్లాక్‌ల కేటాయింపు ప్రక్రియ ముగిసింది. నాటి పాలకుల కుట్రల వల్ల జరిగిన నష్టాన్ని పూడ్చుతూ సింగరేణిని మళ్లీ పూర్వ వైభవానికి తీసుకురావడానికి ప్రస్తుత ప్రభుత్వం ఐదేళ్ల బడ్జెట్ ప్లాన్‌తో ముమ్మర కసరత్తు చేస్తోంది.

# జూపల్లి రాజీనామా చేయాలి..

**సంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** ఓట్ల తొలగింపు కుట్రలను తిప్పికొట్టాలని, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, సంగారెడ్డిలో ఎస్సీ, ఎస్టీల అసైన్డ్ భూములు లాక్కుంటున్న కాంగ్రెస్ సర్కార్ కు తగిన గుణపాఠం తప్పదని మాజీ మంత్రి హరీష్ రావు హెచ్చరించారు. సంగారెడ్డిలో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం, సభ్యత్వ నమోదు అవగాహన కార్యక్రమంలో హరీశ్ రావు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, మంత్రుల అబద్ధాలను ఎండగట్టారు. సంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు చింతా ప్రభాకర్, ఎమ్మెల్యేలు మాణిక్ రావు, సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, శశిధర్ రెడ్డి, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జూపల్లి కృష్ణారావు మళ్లీ ప్రెస్ మీట్ పెట్టిండు. నిన్న వాళ్లు గోల్ కొడుదాం అనుకుంటే సెల్ఫ్ గోల్ అయిపోయిందని హరీష్ రావు ఎద్దేవా చేశారు. అందుకే డ్యామేజ్ కంట్రోల్ మొదలు పెట్టారని, అందులో కూడా పప్పులో కాలు వేశారు. దాని సంగతి ఏందో చూద్దామన్నారు. మొన్న సవాల్ విసిరి నిన్న తోక ముడిచి నాకు వాట్సాప్ లో ఒక ఉత్తరం పెట్టిండు. పూటకో సవాలు.. రోజుకో అడ్రస్ లెక్క ఉంది జూపల్లి సంగతి అని విమర్శించారు. మొదలేమో తెలంగాణ భవన్ అన్నాడు.. తర్వాత అమరవీరుల స్థూపం అన్నాడు.. ఇప్పుడేమో సోమాజిగూడ ప్రెస్ క్లబ్ అంటుండు. ముందు నన్ను, కేటీఆర్‌ను చర్చకు రమ్మన్నాడు.. ఇప్పుడు కేసీఆర్‌ను రావాలంటున్నారు. 2023 డిసెంబర్ నుంచి 2026 జూన్ వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఆర్బీఎం కింద తెచ్చిన అప్పు రూ.1,86,087 కోట్లు అయితే.. ఆయన నాకు రాసిన ఉత్తరంలో రూ.1,77,058 కోట్లు అని చెప్తుండు. మరి ఆ రూ.10 వేల కోట్లు ఎక్కడికి పోయినయి..? అని హరీష్ రావు ప్రశ్నించారు.

**రాజీనామా చెయ్యి మిస్టర్ జూపల్లి**

మార్చి 18, 2026 నాడు అసెంబ్లీలో నేను గట్టిగా నిలదీస్తే రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మా ప్రభుత్వం 27 నెలల్లో చేసిన అప్పు రూ. 3,47,294 కోట్లు అని అసెంబ్లీ సాక్షిగా చెప్పిండు. ఇందులో ఏది నిజం? 4 నెలల కింద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పింది నిజమా..? మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పింది నిజమా..? అంటే ఇప్పుడు రాజీనామా ఎవరు చేయాలి? పాలమూరు బిడ్డవైతే.. పౌరుషం ఉంటే, చీము నెత్తురు ఉంటే వెంటనే రాజీనామా చెయ్యి మిస్టర్ జూపల్లి అని సవాల్ విసిరారు. నువ్వు కాదు, మీ ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి, మొత్తం మీ కేబినెట్ ను కూసోబెట్టి నిండు అసెంబ్లీలో బీఆర్ఎస్ చేసిన అప్పు 4 లక్షల కోట్లే అని నిరూపించిన, మీ అబద్ధాలను కడిగి పారేసిన. ఇప్పుడేదో వచ్చి చర్చిద్దాం అంటున్నవ్, అప్పుడు నేను సవాల్ చేస్తే అసెంబ్లీలోనే తలలు కిందవేసుకోని సప్పుడు చేయలేదు. సీనియర్ మంత్రి అంటూనే మీ క్యాబినెట్ ఎంత అప్పు చేసిందో తెల్వదా..? అని ఎద్దేవా చేశారు. కాగ్ రిపోర్టు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ. 4.15 లక్షల కోట్లు అని అసెంబ్లీలో చెప్పింది. నేనూ చెప్పింది, కాగ్ చెప్పింది ఒక్కటే. అబద్ధాలు చెబుతూ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు. జూపల్లి గారు నేను అసెంబ్లీలో మాట్లాడిన వీడియో, రేవంత్ రెడ్డి మాట్లాడిన వీడియో, ఆర్బీఐ లెక్కలు మీకు వాట్సప్ లో పంపుతున్నా చదువుకో.. చీము నెత్తురు ఉంటే రాజీనామా చేయాలని సవాల్ విసురుతున్న అన్నారు.

**సింగూరు మరమ్మతు చేపట్టాలి..**


బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ ఆశీర్వాదంతో మన సంగారెడ్డి జిల్లా, సదాశివపేట నియోజకవర్గానికి ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా నిధులు తీసుకొచ్చాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ హయాంలో మంజూరైన ఎస్డీఎఫ్ నిధులను కూడా వెనక్కి తీసుకునే పరిస్థితి వచ్చిందిన్నారు. అదే విధంగా సంగమేశ్వరబసవేశ్వర ప్రాజెక్టు ద్వారా నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును అటకెక్కించి సంగారెడ్డి జిల్లాకు తీవ్ర అన్యాయం చేస్తోంది. రేపు ఏడు మండలాల ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. సంగమేశ్వర ప్రాజెక్టు గురించి, బసవేశ్వర ప్రాజెక్టు గురించి జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఒక్కరోజైనా మాట్లాడారా..? అని హరీష్ రావు ప్రశ్నించారు. జిల్లాకు చెందిన మంత్రి ఈ అంశంపై ఎందుకు మాట్లాడటం లేదు..? మీ నియోజకవర్గాల్లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు ఇస్తే, మా సంగారెడ్డి జిల్లాకు, మా రైతులకు ఉపయోగపడే సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్టులకు ఎందుకు నిధులు ఇవ్వడం లేదు. తక్షణమే ఈ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలి. లేకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లాలో పెద్ద ఎత్తున ఉద్యమాలు, పాదయాత్రలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

**బీఆర్ఎస్ రోడ్డెక్కితే తప్ప ప్రభుత్వం స్పందించడం లేదు**

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రైతులు ఇబ్బందులు పడుతున్నారని సమాచారం వచ్చిన వెంటనే కేసీఆర్ గారితో మాట్లాడి రెండు రోజుల్లోనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేవాళ్లం. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ రోడ్డెక్కితే తప్ప ప్రభుత్వం స్పందించడం లేదు. ఇప్పటికే రైతులకు రావాల్సిన సుమారు రెండు కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాకు రావాల్సిన ఆ నిధులు ఇప్పటికీ ఎందుకు విడుదల చేయలేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలి. సింగూరు ప్రాజెక్టుకు మరమ్మతు చేస్తాం అని చెప్పి ఇప్పటికీ చర్యలు తీసుకోలేదు. సింగూరు ప్రాజెక్టు సంగారెడ్డి జిల్లాకే కాదు, హైదరాబాద్‌కు తాగునీరు అందించే కీలకమైన ప్రాజెక్టు. ఇప్పటికైనా తక్షణమే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఎస్సీ, ఎస్టీ, బీసీల అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు ఉన్న భూములనే లాక్కుంటోంది. ఒక్క సంగారెడ్డిలోనే 700 ఎకరాలు, రాష్ట్రవ్యాప్తంగా 50 వేల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కునే కుట్ర జరుగుతోంది. ఎకరం రూ. 3 కోట్లు ఉంటే రూ. 40 లక్షలు ఇస్తామని గిరిజనులను మోసం చేస్తున్నారు. మహిళలకు నెలకు రూ.2500, వృద్ధులకు రూ.4000 పెన్షన్, ఫీజు రీయింబర్స్ మెంట్, పీఆర్సీ.. ఇలా ఏ ఒక్క హామీని రేవంత్ ప్రభుత్వం నెరవేర్చలేదు. మూసీ సుందరీకరణ పేరుతో హడావుడి చేస్తున్న ప్రభుత్వం మల్లన్నసాగర్ గురించి ఎందుకు మాట్లాడటం లేదు? ఆ మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగునీరు, మూసీకి నీళ్లు వెళ్తున్నాయంటే అది కేసీఆర్ గారు, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషే అని గుర్తు చేశారు. మల్లన్నసాగర్ రేవంత్ రెడ్డి అయ్య కట్టాడా? ఈరోజు హైదరాబాద్‌కు అది పెద్ద దిక్కుగా మారిందంటే అది కేసీఆర్ చలువే అన్నారు.

## సంపాదకీయం

# నగరాన్ని ముంచేస్తున్న నిర్లక్ష్యం




వర్షం పడితే నగరాలు మునిగిపోవడం ఇప్పుడు దేశంలోని అనేక మహానగరాల్లో సాధారణ దృశ్యంగా మారింది. అయితే హైదరాబాద్‌లో ఇటీవలి కాలంలో వెలుగులోకి వస్తున్న వాస్తవాలు చూస్తే, నగరాన్ని ముంచెత్తుతున్నది కేవలం ప్రకృతి వైపరీత్యం కాదని, మానవ నిర్లక్ష్యం, పౌర బాధ్యతారాహిత్యం, పరిపాలనా వైఫల్యాలు కలిసి సృష్టించిన సంక్షోభమని స్పష్టమవుతోంది. వరదలు వస్తే ప్రభుత్వం, అధికారులు, వర్షపాతాన్ని నిందించడం సులభమే. కానీ వరద కాలువలను శుభ్రం చేస్తుండగా బయటపడుతున్న చెత్త కుప్పలు చూస్తే అసలు కారణం ఎక్కడుందో అర్థమవుతోంది. ఒకప్పుడు చెత్త డంపింగ్ యార్డుల్లో కనిపించేది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. "చెత్త ఎక్కడ ఉంది?" అనే ప్రశ్నకు "మురుగు కాలువల్లో, వరద కాలువల్లో ఉంది" అనే సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మాటను హైడ్రా అధికారులు ఆవేదనగా చెబుతున్నారు. వారు చేపడుతున్న కాలువల ప్రక్షాళనలో బయటపడుతున్న దృశ్యాలు నగర పౌరుల ప్రవర్తనను అద్దంలా ప్రతిబింబిస్తున్నాయి. లారీల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు, కేబుల్ వైర్లు, పాత పరుపులు, దిండ్లు, దుప్పట్లు, సోఫాలు, కుర్చీలు, ఇంట్లో ఉపయోగం లేని అనేక వస్తువులు కాలువల నుంచి బయటకు వస్తుండడం కేవలం ఆశ్చర్యమే కాదు, ఆందోళన కలిగించే విషయం కూడా. వరద నీరు వేగంగా వెళ్లేందుకు కోట్ల రూపాయలతో నిర్మించిన బాక్స్ డ్రైన్లు చెత్తతో నిండిపోతే వాటి నిర్మాణ ప్రయోజనం పూర్తిగా నశిస్తుంది. వర్షపు నీరు తన సహజ మార్గంలో ప్రవహించలేక రోడ్లపైకి వస్తుంది. కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయమవుతాయి. చివరకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. వర్షాన్ని నిందించడం కంటే ముందుగా కాలువల్లోకి చెత్తను ఎవరు వేస్తున్నారు? అనే ప్రశ్నకు సమాజమే సమాధానం చెప్పాల్సి ఉంటుంది. మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు ఉన్న ప్రధాన వరద కాలువల్లో హైడ్రా నిర్వహించిన తనిఖీలు పరిస్థితి ఎంత దారుణంగా ఉందో బయటపెట్టాయి. బాక్స్ డ్రైన్లలో కేబుల్ వైర్లు గుట్టలుగా పేరుకుపోవడం, ప్లాస్టిక్ వ్యర్థాలు నీటి ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకోవడం, మట్టిపూడికతో కాలువలు మూసుకుపోవడం వల్ల వరద నీరు ముందుకు కదలలేని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా చందానగర్, లింగంపల్లి రైల్వే అండర్‌పాస్‌ల వద్ద ప్రతి భారీ వర్షానికీ నీరు నిలిచిపోవడానికి ఇదే ప్రధాన కారణమని అధికారులు గుర్తించారు. నక్కవాగుకు చేరాల్సిన వరదనీరు మార్గమధ్యంలోనే నిలిచిపోవడంతో రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. హైడ్రా ఇటీవల చేపట్టిన శుభ్రపరిచే కార్యక్రమంలో రెండు ట్రక్కుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఒక్క ప్రాంతం నుంచే బయటపడటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఇది ఒక్క ప్రాంతం కథ మాత్రమే కాదు. నగరంలోని అనేక కాలువల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఇక్కడ మరో ప్రశ్న తలెత్తుతోంది. ప్రతి సంవత్సరం కాలువల పూడికతీతకు ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. మియాపూర్, శేరిలింగంపల్లి, మాదాపూర్ వంటి సర్కిళ్లలో ఒక్కో సర్కిల్‌కే సుమారు కోటి రూపాయల వరకు వ్యయం చేస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రత్యేక కాంట్రాక్టర్లను నియమించి కాలువలను శుభ్రం చేయాల్సిన బాధ్యత అప్పగిస్తున్నారు. తొలగించిన వ్యర్థాల పరిమాణాన్ని బట్టి బిల్లులు చెల్లిస్తున్నారు. అయినప్పటికీ ప్రతి ఏడాది అదే కాలువల్లో మళ్లీ భారీగా చెత్త పేరుకుపోవడం ఎందుకు? కాంట్రాక్టర్ల పనితీరుపై పర్యవేక్షణ ఉందా? నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా? చెల్లిస్తున్న ప్రజాధనానికి తగిన ఫలితం దక్కుతోందా? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు. పరిపాలనా వ్యవస్థలో మరో లోపం అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రైనేజీ ప్రాజెక్టులు. మంజీర రోడ్డు పరిసర ప్రాంతాల నుంచి ఈర్ల చెరువు వరకు డ్రైన్ బాక్స్ నిర్మాణానికి రెండేళ్ల క్రితమే కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. అయితే పనులు మధ్యలోనే ఆగిపోయాయి. డ్రైన్లను చెరువులతో అనుసంధానం చేయలేదు. ఫలితంగా వర్షపు నీరు చెరువుల్లోకి చేరకుండా కాలనీలు, రోడ్లపైనే నిలిచిపోతోంది. ఒకవైపు ప్రజలు వరదలతో ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు చెరువులకు నీరు చేరకపోవడం ప్రణాళికా లోపాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ సమస్యలో పౌరుల పాత్రను కూడా విస్మరించలేం. ఇంట్లో పనికిరాని వస్తువులను రాత్రివేళ కాలువల్లో పడేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్లక్ష్యంగా విసరడం, నిర్మాణ వ్యర్థాలను డ్రైన్లలో వేయడం వంటి చర్యలు చివరకు నగరానికే ముప్పుగా మారుతున్నాయి. ప్రతి ఇంటి నుంచి వచ్చే చిన్నచిన్న నిర్లక్ష్యాలే కలిసి నగరవ్యాప్తంగా భారీ విపత్తులకు దారితీస్తున్నాయి. అందుకే సివిక్ సెన్స్ గురించి కేవలం పాఠశాలల్లో చెప్పడం సరిపోదు. ప్రతి పౌరుడు దాన్ని తన దైనందిన జీవనశైలిలో భాగం చేసుకోవాలి. హైడ్రా ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కాకముందే కాలువలను శుభ్రం చేస్తూ ముంపు నివారణకు చర్యలు చేపడుతోంది. ఇది స్వాగతించదగిన చర్యే. అయితే సమస్యకు ఇది తాత్కాలిక పరిష్కారం మాత్రమే. చెత్త మళ్లీ కాలువల్లో పడకుండా నిరోధించే వ్యవస్థను రూపొందించాలి. కాలువల వద్ద నిఘా కెమెరాలు ఏర్పాటు చేయడం, చెత్త వేస్తున్న వారిపై భారీ జరిమానాలు విధించడం, పౌర సంఘాల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, కాలనీల్లో వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేయడం వంటి చర్యలు సమాంతరంగా సాగాలి. కాలువల నిర్వహణలో కూడా ఆధునిక సాంకేతికతను వినియోగించాల్సిన అవసరం ఉంది. డ్రోన్లతో తనిఖీలు, జియో-ట్యాగింగ్ ద్వారా సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు, సీజన్‌కు ముందే పూడికతీత పూర్తి చేయడం, ప్రతి పనిని ప్రజలకు అందుబాటులో ఉండే డిజిటల్ వ్యవస్థలో నమోదు చేయడం ద్వారా పారదర్శకత పెరుగుతుంది. ప్రజాధనం ఖర్చు చేసే ప్రతి రూపాయి ఫలితాన్ని ప్రజలు చూసేలా వ్యవస్థ ఉండాలి. హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా ఎదగాలని లక్ష్యాలు నిర్దేశించుకుంటోంది. భారీ ఐటీ సంస్థలు, విశాల రహదారులు, ఆధునిక మౌలిక వసతులు నగర అభివృద్ధికి సూచికలు కావచ్చు. కానీ ప్రతి వర్షానికీ రోడ్లు చెరువులుగా మారితే, కాలువలు చెత్త కుప్పలుగా మారితే ఆ అభివృద్ధి అసంపూర్ణంగానే మిగులుతుంది. స్మార్ట్ సిటీ అనేది కేవలం సాంకేతికతతో కాదు, బాధ్యతాయుతమైన పౌరులతో, సమర్థవంతమైన పరిపాలనతో, క్రమశిక్షణతో కూడిన పట్టణ సంస్కృతితో నిర్మితవవుతుంది. ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తించాలి. స్థానిక సంస్థలు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలి. కాంట్రాక్టర్ల పనితీరుపై కఠిన చర్యలు తీసుకోవాలి. హైడ్రా చేపడుతున్న చర్యలకు అన్ని శాఖలు సమన్వయంతో సహకరించాలి. అదే సమయంలో ప్రతి పౌరుడు కూడా తన బాధ్యతను గుర్తించాలి. ఇంటి ముందు పరిశుభ్రతతో పాటు నగర పరిశుభ్రతను కూడా తన బాధ్యతగా భావించాలి. కాలువల్లో చెత్త వేయడం అంటే కేవలం ఒక ప్రదేశాన్ని మురికిగా మార్చడం కాదు. అది వర్షపు నీటి మార్గాన్ని మూసివేయడం. ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడం. ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం మోపడం. చివరకు మన నగర భవిష్యత్తునే ముంపులోకి నెట్టడం. ప్రకృతి తన పని చేస్తుంది. వర్షాలు కురుస్తాయి. కానీ నగరం మునగాలా? లేక సురక్షితంగా నిలవాలా? అన్నది మన చేతుల్లోనే ఉంది. పౌర బాధ్యత, సమర్థ పరిపాలన, నిరంతర పర్యవేక్షణ ఈ మూడు కలిసినప్పుడే హైదరాబాద్‌కు వరదల నుంచి శాశ్వత విముక్తి లభిస్తుంది.

# ఉస్మానియా విజయం...




జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా వైద్యుల సేవలను స్మరించుకుంటున్న వేళ, హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వైద్య బృందం సాధించిన ఒక అరుదైన ఘనత దేశ వైద్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే మైలురాయిగా మారింది. దేశంలోనే తొలిసారిగా ఒకే రోగికి ఐదు కీలక అవయవాలను విజయవంతంగా మార్పిడి చేసి ప్రాణాలు కాపాడిన ఈ శస్త్రచికిత్స కేవలం ఒక వైద్య విజయం మాత్రమే కాదు. ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ఉన్న అనుమానాలను చెరిపేసిన ఘన విజయగాథ కూడా. సాధారణంగా అత్యంత క్లిష్టమైన అవయవ మార్పిడి శస్త్రచికిత్సలంటే కార్పొరేట్ ఆస్పత్రులే గుర్తుకొస్తాయి. అత్యాధునిక పరికరాలు, భారీ మౌలిక వసతులు, వేల కోట్ల పెట్టుబడులు, అంతర్జాతీయ ప్రమాణాల సౌకర్యాలు ఉన్న ఆస్పత్రుల్లోనే ఇలాంటి అద్భుతాలు సాధ్యమవుతాయని చాలా మంది నమ్ముతుంటారు. అయితే ఉస్మానియా వైద్యులు ఆ భావనను పూర్తిగా తలకిందులు చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకు అత్యంత అరుదుగా నమోదైన మల్టీ-విసెరల్ ట్రాన్స్‌ప్లాంట్ శస్త్రచికిత్సల్లో ఒకదాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో విజయవంతంగా పూర్తి చేసి భారత వైద్య రంగాన్ని ప్రపంచ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విజయానికి వెనుక ఉన్న కథ మరింత హృదయాన్ని కదిలిస్తుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన 30 ఏళ్ల యువ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తీవ్రమైన జీర్ణవ్యవస్థ సమస్యలతో ముందుగా నగరంలోని ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రిని ఆశ్రయించాడు. అక్కడ భారీ వ్యయంతో వరుసగా నాలుగు శస్త్రచికిత్సలు నిర్వహించినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదు. పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. చివరకు వైద్యపరంగా చేయగలిగింది ఏమీ లేదని చెప్పిన తర్వాత కుటుంబ సభ్యులు చివరి ఆశగా ఉస్మానియా వైద్యులను ఆశ్రయించారు. అక్కడి వైద్యులు మాత్రం వెనక్కి తగ్గలేదు. రోగి పరిస్థితిని లోతుగా పరిశీలించారు. చిన్నపేగుతో పాటు జీర్ణవ్యవస్థలోని పలు అవయవాల్లో ప్రీ-క్యాన్సరస్ ట్యూమర్లు ఉన్నట్లు గుర్తించారు. సాధారణ చికిత్సతో సమస్య పరిష్కారం కాదని, మొత్తం జీర్ణవ్యవస్థలోని కీలక అవయవాలను మార్పిడి చేయడమే ఏకైక మార్గమని నిర్ణయించారు. ప్రపంచవ్యాప్తంగా కూడా అత్యంత అరుదుగా మాత్రమే జరిగిన ఈ శస్త్రచికిత్స కోసం అంతర్జాతీయ వైద్య పరిశోధనలను అధ్యయనం చేశారు. అమెరికాలోని క్లీవ్‌లాండ్ క్లినిక్ నిపుణులతో సంప్రదింపులు జరిపారు. అనంతరం బ్రెయిన్‌డెడ్ దాత నుంచి సేకరించిన జీర్ణాశయం, డ్యుయొడెనమ్, ప్యాంక్రియాస్, చిన్నపేగు, పెద్దపేగు అనే ఐదు అవయవాలను సుమారు 36 గంటలపాటు నిరంతరాయంగా శ్రమించి విజయవంతంగా మార్పిడి చేశారు. ఇది కేవలం సాంకేతిక నైపుణ్యమే కాదు; వైద్యుల అంకితభావం, పట్టుదల, సమన్వయం, రోగి ప్రాణాలను కాపాడాలనే తపనకు నిదర్శనం. ఈ కథలో అత్యంత విశేషమైన అంశం మరొకటి ఉంది. కోట్ల రూపాయలు ఖర్చు చేసినా చికిత్స పూర్తికాని రోగికి ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పథకం కింద ఒక్క రూపాయి అదనపు భారం లేకుండా ప్రపంచ స్థాయి చికిత్స అందడం నిజంగా ప్రజా వైద్య వ్యవస్థ గర్వించదగ్గ విషయం. ప్రభుత్వ ఆస్పత్రులు కేవలం సాధారణ వైద్య సేవలకే పరిమితం కావు; అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సలను కూడా విజయవంతంగా నిర్వహించే సామర్థ్యం వాటికి ఉందని ఈ విజయం మరోసారి స్పష్టం చేసింది. ఈ విజయాన్ని రాష్ట్ర ప్రభుత్వం, జాతీయ అవయవ మార్పిడి సంస్థ నోటో, అలాగే ప్రధానమంత్రి కార్యాలయం గుర్తించి అభినందించడం యాదృచ్ఛికం కాదు. ఒక ప్రభుత్వ ఆస్పత్రి ప్రపంచ స్థాయి వైద్య ప్రతిభను ప్రదర్శించినప్పుడు అది ఒక్క సంస్థ విజయం మాత్రమే కాదు; భారత ప్రజా వైద్య వ్యవస్థకు వచ్చిన గౌరవం కూడా. అయితే ఈ చారిత్రాత్మక విజయంపై కార్పొరేట్ వైద్య రంగం నుంచి పెద్దగా స్పందన లేకపోవడం వైద్య వర్గాల్లో చర్చకు దారితీసింది. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు దీనిని మౌనంగా తీసుకోగా, మరికొందరు ఇలాంటి విజయాలకు విస్తృత గుర్తింపు రావాల్సిన అవసరాన్ని ప్రస్తావిస్తున్నారు. ఏ కారణం ఉన్నా, ఈ ఘనత వైద్యరంగంలో ఆరోగ్యకరమైన పోటీకి, పరస్పర అభినందన సంస్కృతికి దోహదపడాల్సిన అవసరం ఉందన్నది స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటి సమాజంలో కార్పొరేట్ ఆస్పత్రులపై ప్రజలకు సహజంగానే ఎక్కువ విశ్వాసం ఏర్పడింది. ఖరీదైన చికిత్స అంటేనే మెరుగైన వైద్యం అనే భావన కూడా బలపడింది. కానీ ఉస్మానియా విజయం ఆ అభిప్రాయాన్ని పునఃపరిశీలించేలా చేస్తోంది. నైపుణ్యం అనేది కేవలం ఖరీదైన మౌలిక వసతుల్లోనే ఉండదు; సేవాభావం, అనుభవం, అంకితభావం, నిరంతర అధ్యయనం ఉన్న చోటే అసలైన వైద్య ప్రతిభ వికసిస్తుంది. ప్రభుత్వ వైద్యుల పనితనం చాలా సందర్భాల్లో ప్రచారానికి దూరంగానే ఉంటుంది. వందలాది క్లిష్టమైన శస్త్రచికిత్సలు, వేలాది ప్రాణాలను కాపాడే సేవలు నిశ్శబ్దంగానే కొనసాగుతుంటాయి. కానీ ఇలాంటి అరుదైన విజయాలు వెలుగులోకి వచ్చినప్పుడల్లా ప్రభుత్వ వైద్య రంగంలో పనిచేస్తున్న వేలాది మంది వైద్యులు, నర్సులు, సాంకేతిక సిబ్బంది చేస్తున్న సేవలకు సమాజం తగిన గౌరవం ఇవ్వాల్సిన అవసరం గుర్తుకు వస్తుంది. ఈ సందర్భంగా ప్రభుత్వాలకు కూడా ఒక బాధ్యత ఉంది. ఉస్మానియా వంటి ప్రభుత్వ ఆస్పత్రులకు మరింత ఆధునిక పరికరాలు, ప్రత్యేక శిక్షణ, పరిశోధనకు ప్రోత్సాహం, నిపుణుల నియామకం, అవయవ మార్పిడి కార్యక్రమాలకు అవసరమైన వనరులు కల్పిస్తే ప్రపంచస్థాయి వైద్య విజయాలు మరింత పెరుగుతాయి. ప్రజలకు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వస్తుంది. చివరగా, ఒక విషయం మాత్రం నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. వైద్య వృత్తిలో అసలైన అవార్డు ప్రచారం కాదు, ప్రశంసలు కాదు, ఖరీదైన ఆస్పత్రుల హంగులు కూడా కాదు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక మనిషికి కొత్త జీవితం ఇవ్వడమే వైద్య వృత్తికి అత్యున్నత గౌరవం. ఆ గౌరవాన్ని తమ అంకితభావంతో సొంతం చేసుకున్న ఉస్మానియా వైద్య బృందం నిజంగా దేశం గర్వించదగ్గ వైద్యులు. వారి విజయం ప్రభుత్వ వైద్యానికి కిరీటం మాత్రమే కాదు, సమాజం ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థపై మరింత విశ్వాసం పెంచుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేసిన చారిత్రాత్మక ఘట్టం.




# పేరు మారదు... మారాల్సింది వ్యవస్థే!

భారతదేశం వైవిధ్యానికి ప్రతీక. భాషలు, మతాలు, సంస్కృతులు, సంప్రదాయాలే కాదు, వ్యక్తుల పేర్లు నమోదు చేసే విధానంలోనూ అపారమైన భిన్నత్వం కనిపిస్తుంది. అలాంటి దేశంలో డిజిటల్ పరిపాలనను ఒకే మూసలో నడిపించాలనే ప్రయత్నం ఎంత ప్రమాదకరమో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ స్పష్టంగా చాటుతోంది. సాంకేతికత ప్రజల జీవితాలను సులభతరం చేయాల్సింది పోయి, వారి గుర్తింపునే ప్రశ్నించే పరిస్థితి ఏర్పడటం ఆందోళన కలిగించే అంశం. ప్రస్తుతం ఓటరు జాబితా సవరణలు, ఆధార్ అనుసంధానం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తున్న వేలాది మంది సాంకేతిక సమస్యలతో సతమతమవుతున్నారు. దరఖాస్తుదారుల వివరాల్లో తప్పులేకపోయినా, సాఫ్ట్‌వేర్ వాటిని తిరస్కరిస్తోంది. దీనికి కారణం పౌరులు కాదు; భారతదేశ సామాజిక, సాంస్కృతిక వాస్తవాలను అర్థం చేసుకోకుండా రూపొందించిన డిజిటల్ వ్యవస్థలే. తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణ భారతదేశంలో ఇంటిపేరు వ్యక్తి పేరుకు ముందుగా రావడం సహజం. కానీ దేశవ్యాప్తంగా ఉపయోగిస్తున్న అనేక ప్రభుత్వ సాఫ్ట్‌వేర్‌లు మాత్రం "ఫస్ట్ నేమ్ -- మిడిల్ నేమ్ -- లాస్ట్ నేమ్" అనే పాశ్చాత్య నమూనాను మాత్రమే అనుసరిస్తున్నాయి. ఈ కారణంగా ఆధార్‌లో ఒక విధంగా, ఓటర్ కార్డులో మరో విధంగా పేరు నమోదైతే, రెండూ ఒకే వ్యక్తివైనా సిస్టమ్ వాటిని సరిపోల్చలేకపోతోంది. పేరులోని అక్షరాలు ఒకేలా ఉన్నా, వాటి స్థానాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవడం సాంకేతిక పరిపక్వత లోపాన్ని వెల్లడిస్తోంది. సమస్య అంతటితో ఆగిపోవడం లేదు. ఒక పత్రంలో ఇంటిపేరు సంక్షిప్తంగా, మరొకదాంట్లో పూర్తి రూపంలో ఉండటం, ఇంగ్లిష్-తెలుగు లిప్యంతరీకరణలో వచ్చే చిన్న మార్పులు, వివాహానంతరం మహిళల ఇంటిపేర్ల మార్పు వంటి అంశాలన్నీ దరఖాస్తులను తిరస్కరించే కారణాలుగా మారుతున్నాయి. కృత్రిమ మేధస్సు, డేటా అనలిటిక్స్ గురించి గొప్పలు చెప్పుకునే కాలంలో కూడా ఒకే వ్యక్తిని గుర్తించే ప్రాథమిక సామర్థ్యం ప్రభుత్వ సాఫ్ట్‌వేర్‌లకు లేకపోవడం ఆశ్చర్యకరం. దక్షిణాది ముస్లిం సమాజంలో "బిన్", "బింతె" వంటి అరబిక్ సంప్రదాయ పదాల వినియోగం, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో ఇంటిపేర్ల స్థానంలో తండ్రి పేరు లేదా గ్రామం పేరును ఉపయోగించే సంప్రదాయం, కొన్ని ప్రాంతాల్లో ఇంటిపేరు లేకపోవడం వంటి వాస్తవాలను కూడా ప్రస్తుత వ్యవస్థ పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఫలితంగా ఒకే వ్యక్తి ప్రభుత్వ రికార్డుల్లో వేర్వేరు వ్యక్తిగా మారిపోతున్నాడు. ఇది కేవలం ఓటర్ల జాబితా సమస్య కాదు. ఆధార్, పాన్, పాస్‌పోర్టు, బ్యాంకింగ్, ఆరోగ్య సేవలు, విద్య, పన్నులు... ఇలా దాదాపు ప్రతి డిజిటల్ సేవలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. డిజిటల్ ఇండియా లక్ష్యం ప్రజలకు సౌకర్యం కల్పించడమే కాని, పేర్లలోని సాంస్కృతిక వైవిధ్యాన్ని తిరస్కరించడం కాదు. అందుకే ఇప్పుడు విధానపరమైన సంస్కరణలు అత్యవసరం. "ఫస్ట్ నేమ్, మిడిల్ నేమ్, లాస్ట్ నేమ్" అనే కఠిన నమూనాకు బదులుగా "పూర్తి పేరు" అనే ఏకైక ఫీల్డ్‌ను ప్రవేశపెట్టాలి. వ్యక్తి తన ప్రాంతీయ సంప్రదాయానికి అనుగుణంగా పేరును నమోదు చేసుకునే స్వేచ్ఛ కల్పించాలి. పేర్లలోని చిన్నచిన్న తేడాలను కూడా గుర్తించగల ఆధునిక ఫజ్జీ మ్యాచింగ్ అల్గారిథమ్‌లను అభివృద్ధి చేయాలి. వ్యక్తి గుర్తింపును కేవలం పేరు ఆధారంగా కాకుండా జన్మతేది, వయస్సు, తల్లిదండ్రుల వివరాలు, ఇతర ధృవీకరణలతో సమన్వయం చేసే విధంగా వ్యవస్థలను రూపకల్పన చేయాలి. సాంకేతికత మనిషి కోసం ఉండాలి; మనిషి సాంకేతికతకు అనుగుణంగా మారాల్సిన అవసరం లేదు. భారతదేశం వంటి బహుళ సంస్కృతుల దేశంలో డిజిటల్ వ్యవస్థలు కూడా అదే వైవిధ్యాన్ని ప్రతిబింబించాలి. ఒక ప్రాంతపు నమూనాను దేశమంతటికీ రుద్దడం సమగ్ర పరిపాలన కాదు. ప్రతి పౌరుడి గుర్తింపును, ప్రతి ప్రాంతపు సంస్కృతిని సమానంగా గౌరవించే వ్యవస్థలే నిజమైన డిజిటల్ ప్రజాస్వామ్యానికి పునాది వేస్తాయి. పేరు ప్రజలది... దాన్ని గౌరవించడం ప్రభుత్వ బాధ్యత. మారాల్సింది ప్రజల పేర్లు కాదు, వాటిని అర్థం చేసుకోలేని డిజిటల్ వ్యవస్థలే.

# పాఠ్యపుస్తకాల్లో పర్సంటేజీల పర్వం..!



### ఎన్ని పుస్తకాలు సీజ్ చేశారు?

జిల్లావ్యాప్తంగా ప్రీ-ప్రైమరీ, ప్రైమరీ, హయ్యర్ ప్రైవేట్ పాఠశాలలు సుమారు 150 ఉండగా వాటిలో ఎన్ని ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నాయన్నది ఇప్పటికీ మిలియన్ డాలర్ల ప్రశ్న గానే ఉంది. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిల్వ ఉంచిన పాఠ్యపుస్తకాలను విద్యార్థి సంఘం నాయకులు ఈ మధ్యకాలంలో జిల్లా కేంద్రంతో పాటు మరికొన్ని చోట్ల గుర్తించి విద్యాశాఖ అధికారులకు అప్పగించారు. అధికారులు మొత్తం ఎన్ని పుస్తకాలు సీజ్ చేశారు, ఏయే పాఠశాలలపై చర్యలు తీసుకున్నారు, ఎంత మందికి నోటీసులు జారీ చేశారనే వివరాలు ఇప్పటివరకు వెల్లడించక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. చర్యలు తీసుకుంటామని చెప్పడం మాత్రమే కాకుండా, సీజ్ చేసిన పుస్తకాల పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ వ్యవహారంపై పలుమార్లు జిల్లా విద్యాశాఖ అధికారిని చరవాణిలో వివరణ కోరే ప్రయత్నం చేయగా స్పందించలేదు.

**మహబూబాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఏటా పెరుగుతున్న ప్రైవేట్ పాఠశాలల ఫీజులకు తోడు పుస్తకాలు, యూనిఫాం, రవాణా, ఇతర పేర్లతో వసూలు చేస్తున్న అదనపు ఛార్జీలు తల్లిదండ్రులకు తలకు మించిన భారంగా మారుతున్నాయి. మధ్యతరగతి, పేద కుటుంబాలు పిల్లల చదువుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి. మరోవైపు మాకు లాభాలే ముఖ్యమంటూ కొన్ని ప్రైవేటు పాఠశాలలు విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఏ తరగతికి ఎలాంటి మెటీరియల్ ముద్రించాలి, ఎంత విక్రయించాలి, ఎంత లాభం రావాలి అనే అంశాలపై బుక్ స్టాల్స్ తో ముందస్తు ఒప్పందాలు జరుపుకున్నట్లు సమాచారం. ఈ ఒప్పందాల ప్రకారం విక్రయాల ద్వారా వచ్చే లాభాల్లో 50 శాతం పాఠశాల యాజమాన్యానికి, 50 శాతం బుక్ స్టాల్ యాజమాన్యానికి వెళ్తున్నట్లు తెలుస్తోంది. పెట్టుబడి అంతా బుక్ స్టాల్ యజమానిదే అయినా ఎలాంటి పెట్టుబడి లేని స్కూల్ యాజమాన్యమే సింహభాగం లాభాలు దక్కించుకోవడం గమనార్హం. మెటీరియల్ అమ్ముడుపోయిన, అమ్ముడు పోకపోయినా ఆయా పాఠశాలలకు కమిషన్ ముందుగానే చెల్లించాల్సిందేననే నిబంధనలు కూడా ఉన్నట్లు సమాచారం.

**జీఎస్టీ, డిస్కౌంట్ పేరిట తల్లిదండ్రులకు కుచ్చుటోపి..**

పబ్లిషర్స్ వద్ద నుంచి బిల్లులు లేకుండా తక్కువ ధరకే విద్యా సామగ్రిని కొనుగోలు చేస్తున్నప్పటికీ, తల్లిదండ్రులకు మాత్రం జీఎస్టీ పెరిగిందంటూ అధిక ధరలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేల రూపాయలు చెల్లించిన తర్వాత బిల్లు అడిగితే అధికారిక జీఎస్టీ బిల్లు కాకుండా ఒక తెల్ల కాగితంపై చేతితో రాసి ఇస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మార్కెట్‌లో సుమారు రూ.1,500 విలువ చేసే పూర్తి మెటీరియల్‌ను తమకు నచ్చిన విధంగా ఎమ్మార్పీ ముద్రించి రూ.3,500 వరకు విక్రయిస్తున్నారని సమాచారం. 10 నుంచి 15 శాతం డిస్కౌంట్ ఇస్తున్నాం అంటూ తల్లిదండ్రులను నమ్మిస్తూ అసలు ధరకు రెట్టింపు వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారం పై విద్య, వాణిజ్య శాఖల అధికారుల సమగ్ర దర్యాప్తు చేసి దోపిడీకి అడ్డుకట్ట వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



# సిద్ధాపూర్‌లో ఎకోటౌన్‌కు గ్రీన్ సిగ్నల్

**షాద్ నగర్,ఫ్లాష్ ఇండియా :** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామంలో ప్రతిపాదిత ఎకో-టౌన్ ప్రాజెక్టుకు తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. 86 ఎకరాల ప్రభుత్వ భూమిలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఆధునిక ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ఇప్పటికే ఇచ్చిన అనుమతిని ప్రభుత్వం అధికారికంగా ధృవీకరిస్తూ గురువారం జీవో నంబర్ 641ను విడుదల చేసింది. తెలంగాణ ప్రభుత్వం, జపాన్‌లోని కిటాక్యూషూ నగరం మధ్య కుదిరిన సహకార ఒప్పందం మేరకు ఈ ఎకో-టౌన్ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నారు. సర్క్యులర్ ఎకానమీ, నెట్-జీరో లక్ష్యాల సాధన దిశగా ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది. ఈ ప్రాజెక్టు కోసం టీజీఐఐసీకి చెందిన 86 ఎకరాల భూమిని జీహెచ్ఎంసీకి ఉచితంగా బదిలీ చేయగా, హెచ్ఐఎంఎస్ డబ్ల్యు సంస్థ ఆధ్వర్యంలో ఆధునిక వ్యర్థాల నిర్వహణ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం అన్ని చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా అనుమతి ఇచ్చింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్టు అమల్లోకి వస్తే హైదరాబాద్ మహానగర ఘన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు తోడ్పాటుతో పాటు పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన అభివృద్ధికి దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

# మెట్రో ప్రాజెక్టుపై ఫోకస్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మొదటి, రెండో దశ ప్రాజెక్టుల్లో కేంద్ర ప్రభుత్వం జాయింట్ వెంచర్‌గా ఉండాలంటే ఎస్‌బీఐ క్యాప్స్ ఇచ్చే నివేదిక ఆధారంగానే నిర్ణయం తీసుకోవాలని కేంద్రం భావిస్తోంది. ఇందులో భాగంగా మొదటి దశకు సంబంధించిన ఐడీబీఐ, డీఎంఆర్సీ సమర్పించిన నివేదికలను ఇప్పటికే కేంద్రానికి పంపిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అంచనాలతో పాటు కేంద్రం కూడా స్వతంత్రంగా అంచనా వేయడానికి ఎస్‌బీఐ క్యాప్స్‌ను నియమించిందని మెట్రో అధికారులు తెలిపారు. ఇదే సమయంలో మెట్రోరైలు ప్రాజెక్టుతో పాటు మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై కూడా రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్ పెట్టింది.

**కేంద్రానికి రెండు నివేదికలు**

మెట్రో స్వాధీనానికి అవసరమైన ఫైనాన్స్, లీగల్, టెక్నికల్ అంశాలపై రూపొందించిన నివేదికలను మెట్రో అధికారులు కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. టెక్నికల్ కన్సల్టెంట్‌గా ఢిల్లీ మెట్రోరైలు కార్పొరేషన్ (డీఎంఆర్సీ), ఫైనాన్స్ మరియు లీగల్ అడ్వైజర్‌గా ఐడీబీఐ సమర్పించిన నివేదికలను కేంద్రం పరిశీలించిన అనంతరం, ఎస్‌బీఐ క్యాప్స్ ద్వారా మరోసారి సమగ్ర అంచనాలు చేయించనుంది. మొదటి దశ ప్రాజెక్టు స్వాధీనానికి సుమారు రూ.13,600 కోట్ల రుణం అవసరం కాగా, రెండో దశ విస్తరణకు సంబంధించిన అంచనాలు కూడా ఎస్‌బీఐ క్యాప్స్ నివేదిక ఆధారంగానే నిర్ణయించబడనున్నాయి.

**ఢిల్లీకి మెట్రో అధికారులు**

మెట్రోరైలు ప్రాజెక్టు మొదటి దశను స్వాధీనం చేసుకోవడానికి అవసరమైన రూ.13,600 కోట్ల రుణ అంశం కీలకంగా మారింది. ఈ లోన్ ప్రక్రియను త్వరగా పూర్తిచేయడానికి మెట్రో అధికారులు చర్యలు చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో సమావేశమైన తర్వాత పట్టణాభివృద్ధి శాఖ అధికారులతో కలిసి మెట్రో అధికారులు ప్రత్యేకంగా చర్చించారు. ప్రాజెక్టుకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేయడానికి, అవసరమైన పత్రాలను సమర్పించడానికి అధికారులు తరచుగా ఢిల్లీకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇందులో భాగంగా ఇటీవల మెట్రో ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ ఢిల్లీ అధికారులతో సమావేశమయ్యారు.

**6 నెలల్లో ఎస్‌బీఐ క్యాప్స్ నివేదిక**

హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు మొదటి దశ స్వాధీనానికి అవసరమైన రూ.13,600 కోట్ల రుణం, అలాగే రెండో దశ విస్తరణకు సంబంధించిన వ్యయ అంచనాలపై కేంద్రం నియమించిన ఎస్‌బీఐ క్యాప్స్ ఆరు నెలల్లో నివేదిక ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. స్వాధీన ప్రక్రియ, విస్తరణ ప్రణాళికలు, నిర్మాణ వ్యయం, రుణ సేకరణ వంటి అంశాలపై సమగ్రంగా అధ్యయనం చేసి ఈ నివేదిక సమర్పించనుంది. మెట్రో ఆస్తుల అంచనా, విస్తరణ ప్రణాళికల పరిశీలన, పత్రాల పరిశీలన వంటి ప్రక్రియలకు కన్సల్టెన్సీ సంస్థకు డిసెంబర్ వరకు సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. అధికారికంగా 2027లోనే హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు.

# అల్లాడుతున్న రామగుండం ప్రాంతం ప్రజలు



**గోదావరిఖని,ఫ్లాష్ ఇండియా :** పర్యావరణ పరిరక్షణపై ప్రపంచవ్యాప్తంగా చర్చలు జరుగుతున్నా, పారిశ్రామిక ప్రాంతమైన రామగుండంలో మాత్రం కాలుష్య సమస్య రోజురోజుకూ కోరలు చాస్తోంది. ఒకవైపు సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనులు, మరోవైపు ఎన్‌టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ వంటి భారీ పరిశ్రమల నుంచి వెలువడుతున్న పొగ, ధూళి, బూడిద స్థానికుల ఊపిరి తీస్తున్నాయి. రామగుండం, గోదావరిఖని, జ్యోతినగర్ పరిసరాల్లో గాలి నాణ్యత పూర్తిగా క్షీణించింది. బొగ్గు తవ్వకాల సమయంలో ఎగిసిపడే బొగ్గు పొడి, థర్మల్ విద్యుత్ కేంద్రాల బూడిద కణాలు వాతావరణంలో కలవడం వల్ల ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. దగ్గు, ఆస్తమా, అలర్జీలు, ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలతో ఆస్పత్రుల పాలవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చెట్ల నరికివేత.. ప్లాస్టిక్ ముప్పు..**

పారిశ్రామిక విస్తరణ పేరుతో వేలాది పెద్ద చెట్లను తొలగించడం వల్ల సహజ వాతావరణ సమతుల్యత దెబ్బతింటుంది. గతంలో పచ్చదనంతో ఉన్న ప్రాంతాలు ఇప్పుడు బొగ్గు గనులు, కాంక్రీట్ కట్టడాలుగా మారాయి. చెట్లు తగ్గిపోవడంతో గాలిలోని విషవాయువులను శుద్ధి చేసే వ్యవస్థ దెబ్బతిని గ్లోబల్ వార్మింగ్ ప్రభావం తీవ్రమైంది. దీనికి తోడు పట్టణంలో ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా పెరిగింది. రోడ్లు, డ్రైనేజీలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి. వీటిని తగులబెట్టడం వల్ల వెలువడే విషవాయువులతో కాలుష్యం రెట్టింపవుతోంది. ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధ ఉత్తర్వులు జారీ చేసినా, క్షేత్ర స్థాయిలో అమలు శూన్యమని పర్యావరణవేత్తలు విమర్శిస్తున్నారు.

**చిన్నారులపై ఎఫెక్ట్ -- ప్రభుత్వాల నిర్లక్ష్యం..**


ఈ కాలుష్య కాటు చిన్నారులు, గర్భిణీలు, వృద్ధుల పై తీవ్ర ప్రభావం చూపుతోంది. స్కూళ్ల సమీపంలోనూ ధూళి ఎక్కువగా ఉండడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకోలేకపోతున్నారు. కంటి మంటలు, చర్మ సమస్యలు వేధిస్తున్నాయి. ఏటా కోట్లాది రూపాయలు పర్యావరణ పరిరక్షణ, హరితహారం కోసం ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వాలు ప్రకటిస్తున్నా, నాటిన మొక్కల సంరక్షణ కరువై ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా కాలుష్య నియంత్రణ ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలని, గనుల చుట్టూ గ్రీన్ బెల్ట్ (భారీ వృక్షాల పెంపకం) ఏర్పాటు చేయాలని, ప్లాస్టిక్‌ను పూర్తిగా అరికట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడడం కేవలం ప్రభుత్వాలదే కాదు ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




# అర్ధరాత్రి అగ్నిప్రమాదం

**ఇల్లంతకుంట,ఫ్లాష్ ఇండియా :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తాళ్లపల్లి గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్‌లో అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో పత్తిగింజల బస్తాలు దగ్ధమవగా, ఫైర్ సిబ్బంది గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో కొద్దిపాటి ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. మిల్లులో నిల్వ చేసిన పత్తిగింజల బస్తాలకు ఇరువైపులా వడ్ల బస్తాలు ఉన్నప్పటికీ వాటికి పెద్దగా నష్టం జరగకపోవడం, మధ్యలోని పత్తిగింజల బస్తాలకే మంటలు వ్యాపించడం పలు అనుమానాలకు తావిస్తోంది. అగ్నిప్రమాదం ఎలా సంభవించిందనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. మంటలు ఎగసి పడుతున్న విషయం తెలుసుకున్న వెంటనే గ్రామస్థులు, మిల్లు సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. కొంత ఆలస్యమై ఉంటే మంటలు పక్కనే ఉన్న వడ్ల బస్తాలకు వ్యాపించి భారీ ఆస్తి నష్టం జరిగేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో మిల్లులో ఫైర్ సేఫ్టీ ప్రమాణాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అగ్నిమాపక పరికరాలు పనిచేసే స్థితిలో ఉన్నాయా? సంబంధిత అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని పరిశ్రమల్లో ఫైర్ సేఫ్టీపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఎస్సై అశోక్ ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

# రైలు కిందపడి దంపతుల ఆత్మహత్య!



**ఘట్‌కేసర్,ఫ్లాష్ ఇండియా :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్ కేసర్ రైల్వే స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి విషాద ఘటన చోటుచేసుకుంది. దంపతులు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడటంతో అటు వారి సొంత గ్రామంలోనూ, ఇటు వారు నివసిస్తున్న ప్రాంతంలోనూ తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా చెన్నారావుపేట మండలం పాపాయిపేట గ్రామానికి చెందిన రవికుమార్, శిరీష దంపతులు ఘట్‌కేసర్-బీబీనగర్ రైల్వే మార్గంలోని ఎన్ఎఫ్‌సీ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ దంపతులు ప్రస్తుతం పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూరులో నివాసముంటున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక సమాచారం, లభ్యమైన ఆధారాల ప్రకారం, ఈ ఘోర ఘటన ఆత్మహత్యగా బలమైన అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ, దీనిపై పోలీసుల నుంచి ఇంకా అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది. ఈ దంపతులు ఇంతటి తీవ్ర నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలు ఏంటి అనే కోణంలో సికింద్రాబాద్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు విచారణ అనంతరం తెలియనున్నాయి.

# ఈవీ వాహనదారులకు బిగ్ అలర్ట్

**న్యూ ఢిల్లీ :** ఎలక్ట్రిక్ వాహనాల భద్రతకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. ఎలక్ట్రిక్ బ్యాటరీతో నడిచే వాహనాలను వాటి యజమానుల ప్రమేయం లేకుండా, రిమోట్ ద్వారా (దూరం నుండి) పూర్తిగా నిలిపివేసేందుకు దుర్వినియోగం అవుతున్నాయనే ఆరోపణలపై మూడు ప్రముఖ మొబైల్ అప్లికేషన్లను తక్షణమే తొలగించాలని కేంద్రం ఆదేశించినట్లు సమాచారం. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. 'BAT-BMS', 'Lossigy', 'Epoch-i-ion' అనే యాప్‌లను డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల నుండి బ్లాక్ చేయాలని ఆదేశాలు జారీ అయినట్లు తెలుస్తుంది. వాహన కొనుగోలుదారులు, ఫైనాన్స్ కంపెనీల మధ్య వివాదాలు జరిగినప్పుడు, ఇతర అక్రమ కారణాల వల్ల ఈ యాప్‌ల ద్వారా వాహనాల్లోని బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను హ్యాక్ చేసి, ఈవీలను రిమోట్‌గా లాక్ చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీనివల్ల



ప్రయాణంలో ఉన్న వాహనాలు అకస్మాత్తుగా ఆగిపోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో సాంకేతిక పరిజ్ఞానం దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఐటీ శాఖ ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. వీటితో పాటు ఈవీ బ్యాటరీలను రిమోట్‌గా కంట్రోల్ చేస్తూ దుర్వినియోగానికి పాల్పడుతున్న మరికొన్ని ఇతర యాప్‌లను కూడా గుర్తించి, వాటిని సైతం త్వరలోనే పూర్తిగా బ్లాక్ చేస్తామని అధికారిక వర్గాలు స్పష్టం చేసినట్లు సమాచారం అందుతుండగా.. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన రానుంది.

# కోడిగుడ్డు అ'ధర'హో!

**హనుమకొండ,ఫ్లాష్ ఇండియా :** కోడిగుడ్ల ధరకు రెక్కలు వచ్చాయి. గతంలో రూ.5నుంచి రూ.6వరకు పలికే గుడ్డు నేడు రూ.7నుంచి 8 వరకు పలుకుతోంది. 30గుడ్లతో కూడిన ట్రే హోల్‌సెల్‌లో రూ.205లకు విక్రయిస్తున్నారు. విపరీతమైన ఎండల కారణంగా కోళ్లు సరిగ్గా మేత తినక, గుడ్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గుముఖం పట్టడంతో పౌల్ట్రీ ఫాం నిర్వాహకులు గుడ్లధరలు పెంచేశారు. దీనికి తోడు అధిక ఉష్ణోగ్రతల వల్ల పెద్ద మొత్తంలో కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఫలితంగా చికెన్, కోడిగుడ్ల ధరలు ఆకాశాన్ని అంటడంతో సామాన్య ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నిత్యం వ్యాయామం చేసే వారు, జిమ్‌లకు వేళ్లే యువత, ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో గుడ్ల వినియోగం అధికంగా ఉంటుంది. దీనికి తోడు కేక్‌ల తయారీలో గుడ్లను వినియోగించడంతో పాటు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఓవైపు కూరగాయల ధరలు మండిపోతుండగా ఇపుడు కోడిగుడ్ల ధరలు సైతం కొండెక్కడంతో కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**మునుపెన్నడూ ఇంత రేట్లు లేవు..**

ఈసారి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో కోళ్లు పెద్ద మొత్తంలో చనిపోయి గుడ్ల రాబడి తగ్గింది. దీంతో వాటి ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. గత 25ఏళ్లుగా హనుమకొండ టైలర్‌స్ట్రీట్‌లో కోడి గుడ్ల వ్యాపారం చేస్తున్నాను. మునుపెన్నడూ ఇంత రేట్లను చూడలేదు. రెండేళ్ల క్రితం ఇదే తరహాలో కొన్ని రోజులు పాటు గుడ్ల ధరలు పెరిగాయి.

**కొనుగోలు చేయలేకపోతున్నాం..**

కూరగాయల ధరలు పెరిగితే ప్రత్యామ్నాయంగా గుడ్లను కొనుగోలు చేసి వండుకునేవాళ్లం. కానీ ఇప్పుడు గుడ్డు ధర



కూడా ఆకాశాన్ని తాకడంతో ఏం కొనాలో, ఏం తినాలో అర్థం కావడం లేదు. గతంలో గుడ్డు రేటు రూ. 5కు లభించినప్పుడు కేసు (30)గుడ్లు ఒకేసారి కొనుగోలు చేసేది. కానీ నేడు పెరిగిన ధరల కారణంగా పెద్ద మొత్తంలో కోనుగోలు చేయలేకపోతున్నాం.

# పార్కు స్థలాలను కమిషనర్ పట్టించుకోదా...?

**సర్వే నెం: 3 4 పార్కు స్థలంలో అక్రమంగా వేసిన గుడిసెను తొలగించాలి కాలనీవాసుల డిమాండ్**

**పార్కు స్థలానికి పెన్సింగ్ వేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి**



**మేడిపల్లి,ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాలార్జంగ్ కంచ పర్వతాపూర్ సర్వేనెంబర్ 3, 4 లో సిపిఆర్ఐ రోడ్ లో మున్సిపల్ అధికారులు పార్కు స్థలంగా నిర్ణయించి బోర్డు పెట్టి పట్టించుకోకపోవడంతో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు అందులో గుడిసె వేసి కన్స్ట్రక్షన్ మెటీరియల్ వేసి పార్కు స్థలాన్ని దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. లేఅవుట్ చేసినప్పుడు ప్లాట్ కొనుగోలుదారుల అవసరార్థం పార్కు స్థలంగా కేటాయించారు. అందులో కొంత స్థలం అన్యాకాంతం అయినప్పటికీ రాజకీయ పలుకుబడి గలిగిన కొంతమంది స్థానిక నాయకుల ప్రమేయం మేరకు పార్కు స్థలంలో జరిగిన కొన్ని పరిణామాల దృష్ట్యా గత కమిషనర్ దీన్ని పార్క్ స్థలంగా నిర్ధారించి పార్కు సూచిక బోర్డు ను ఏర్పాటు చేశారు. మున్సిపల్ అధికారులు పార్కు స్థలంలో ఫెన్సింగ్ చేసి సౌకర్యాలు కల్పించకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులు గుడిసెలు వేసి కన్స్ట్రక్షన్ మెటీరియల్ డంపు చేసి దుర్వినియోగం పాల్పడుతున్నారని, వాటిని వెంటనే తొలగించి ఫెన్సింగ్ వేసి కాలనీ వాసులకు అందుబాటులో తేవాలని ఈ సందర్భంగా కాలనీవాసులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# ముస్కాన్ 12 పేరుతో ప్రత్యేక కార్యాచరణ

**శేరిలింగంపల్లి,ఫ్లాష్ ఇండియా :** తప్పిపోయిన పిల్లలను గుర్తించడం, భిక్షాటన, పాత వస్తువులు ఏరుకోవడం, బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించడం,బాలల అక్రమ రవాణా, వెట్టిచాకిరి నుండి పిల్లలను రక్షించడం కోసం ఆపరేషన్ ముస్కాన్-12 పేరుతో సైబరాబాద్ పోలీసులు కార్యాచరణ రూపొందించారు. నిరాశ్రయులైన పిల్లలను గుర్తించడానికి సైబరాబాద్ పోలీసులు పోలీసులు 1 జూలై నుండి 31 జూలై, వరకు "ఆపరేషన్ ముస్కాన్-12"ను ప్రారంభిస్తున్నారు. ఇందులో భాగంగా ఒక మహిళా పోలీస్ కానిస్టేబుల్తో సహా సబ్ ఇన్స్పెక్టర్, నలుగురు పోలీస్ కానిస్టేబుళ్లతో కూడిన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మొత్తం ఏడు బృందాలను ఏర్పాటు చేశారు. సైబరాబాద్ కమిషనర్ రమేష్ రెడ్డి, డీసీపీ (మహిళలు & బాలల భద్రతా విభాగం) కె. సృజన మాట్లాడుతూ, "తప్పిపోయిన పిల్లలు, గుర్తు తెలియని పిల్లలు, వివిధ కారణాల వల్ల తమ కుటుంబాల నుంచి విడిపోయిన పిల్లలను గుర్తించడానికి మేము 'దర్పణ్' అనే ఫేషియల్ రికగ్నిషన్ సాఫ్ట్వేర్ అప్లికేషన్ను ఉపయోగిస్తామని తెలిపారు. ఈ బృందాల కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాము. సంబంధిత శాఖల అధికారుల సహకారంతో 'ఆపరేషన్ ముస్కాన్-12' జూలై నెలాఖరు వరకు కొనసాగుతుందని ఏహెచ్టీయూ ఇన్స్పెక్టర్ పి. యదయ్య గౌడ్ తెలిపారు. గతంలో కేసుల డేటా ఆధారంగా, పిల్లలను బలవంతపు కార్మిక వ్యవస్థలోకి నెట్టిన ప్రాంతాలను పోలీసులు గుర్తించారు. ఈ బృందాలు సంబంధిత శాఖల తో కలిసి రక్షణ,పునరావాస కల్పనకు కృషి చేస్తారు. ఈ సమావేశంలో ఏసీబీ ఎస్. కృష్ణ ప్రసాద్, మహిళలు & బాలల సంక్షేమం అధికారులు రాజారెడ్డి, డి. సాహితీ, సహాయ కార్మిక కమిషనర్ ప్రవీణ్ కుమార్, జిల్లా బాలల రక్షణ అధికారి, ఇంతియాజ్, రత్నం, జి.హాలీం తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం..



**కోదాడ,ఫ్లాష్ ఇండియా :** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన సందర్భంగా జరిగిన ఘటన పోలీసు శాఖలో తీవ్ర చర్చకు దారితీసింది. సూర్యాపేట జిల్లా కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ గోపాల్ రెడ్డిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ ఆయనను వీఆర్కు అటాచ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గానికి వెళ్తున్న సమయంలో ముందస్తుగా నిర్ణయించిన అధికారిక మార్గాన్ని అనుసరించకుండా, ప్రత్యామ్నాయ మార్గంలో వాహనాలను తీసుకెళ్లినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారాన్ని డిప్యూటీ సీఎం తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. ఘటనపై వెంటనే రాష్ట్ర డీజీపీ దృష్టికి తీసుకెళ్లిన భట్టి విక్రమార్క, పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని కోరారు. అనంతరం జోనల్-2 ఐజీతో పాటు సూర్యాపేట జిల్లా ఎస్పీని ఘటనపై పూర్తి వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో పోలీసు ఉన్నతాధికారులు ఖమ్మంలో డిప్యూటీ సీఎం భట్టిని కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వివరణ అనంతరం ఎస్ఐ గోపాల్ వ్యవహారంపై డిప్యూటీ సీఎం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎస్ఐ గోపాల్ రెడ్డిపై శాఖాపరమైన చర్యలు చేపట్టిన అధికారులు, ఆయనను వీఆర్కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పరిణామం పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది. అధికారుల షెడ్యూల్, భద్రతా నిబంధనలను అమలులో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమనే సంకేతాన్ని ఈ చర్యల ద్వారా ప్రభుత్వం ఇచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఘటనపై మరింత లోతైన విచారణ కొనసాగే అవకాశం ఉన్నట్లు పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



# ప్రభుత్వ భూమి పై కన్నేసిన అక్రమార్కులు

**పటాన్ చెరు,ఫ్లాష్ ఇండియా :** కాలనీ అభివృద్ధికి, ప్రజలకు మౌలిక సదుపాయాలైన వాటర్ ట్యాంక్, పార్క్ కొరకు కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని కూడా కొందరు అక్రమార్కులు కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. కాలనీకి సంబంధించిన సుమారు 1040 గజాల ప్రభుత్వ స్థలాన్ని అక్రమార్కులు కబ్జా చేసేందుకు యత్నించిగా చెక్ పెట్టారు హైడ్రాధికారులు. ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని మహాదేవపురం కాలనీలోని సర్వే 213, 214 లోని 375 గజాల పార్కు, 665 గజాలలో వాటర్ ట్యాంక్ నిర్మాణం కొరకు స్థలాన్ని కేటాయించారు. ఈ క్రమంలో వాటర్ ట్యాంక్ కొరకు కేటాయించిన 665 గజాల స్థలంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు మొరం వేసుకుని పనులు ప్రారంభించడంతో, గమనించిన కాలనీవాసులు, అసోసియేషన్ సభ్యులు వెంటనే హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రంగంలో దిగిన హైడ్రా అధికారులు కబ్జాకు యత్నించిన స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వ భూమిగా నిర్ధారించారు. హైడ్రా సీఐ మల్లేశ్వర్ ఆధ్వర్యంలో స్థలం చుట్టూ కంచెను ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డులను పాతారు. ఈ సందర్భంగా సిఐ మల్లేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఎక్కడైనా ప్రభుత్వ స్థలాలను కబ్జాకు గురైతే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఒక్క ఫిర్యాదుతో వెంటనే స్పందించిన హైడ్రా సిబ్బంది స్థలాన్ని కబ్జా కాకుండా పరిరక్షించి కంచె ఏర్పాటు చేయడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.



# పురాతన రోడ్డు పనులకు మంత్రి వాకిటి శ్రీహరి సోదరుడు భూమి పూజ..

**మక్తల్,ఫ్లాష్ ఇండియా :** వందల సంవత్సరాల కిందట వైభవంగా రాష్ట్ర సరిహద్దు వరకు ఉన్న రోడ్డును తన సొంత నిధులతో దాదాపు కిలోమీటర్ మేర పునరుద్ధరణ పనులకు శుక్రవారం మధ్యాహ్నం మంత్రి వాకిటి శ్రీహరి సోదరుడు వాకిటి శేషగిరి భూమి పూజ చేశారు. రాజుల సంస్థాన దీశుల కాలంలో హైదరాబాద్ నుండి కృష్ణానది ఆవల ఉన్న కర్ణాటక లోని రాయచూరుకు వెళ్లే రహదారి వైభవంగా ఉండేది 50 సంవత్సరాల కిందట మట్టిరోడుపై గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్న రోడ్డుకు ఇరుపక్కల రైతులు ఆక్రమించుకోవడంతో పిల్ల కాల్వలా మారింది. దీని బాగుచేసి పునరుద్ధరణ చేయాలని మంత్రి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లిగా.. ప్రజల సంక్షేమ ధ్యేయంగా పట్టణంలోని 4వ వార్డు నుండి కానాపురం కర్ని వైపు వెళ్లే రహదారితో బాటు కానాపురం కర్ని చెరువులకు నీటి ప్రవాహానికి సంబంధించిన సమస్యలు తీరుతాయని ప్రజల విజ్ఞప్తి మేరకు మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాలతో మక్తల్ మాజీ ఉపసర్పంచ్ వాకిటి శేషగిరి సంబంధిత అధికార్లతో సమస్యలను పరిష్కరించాడు. సమస్యలు పరిష్కరించడంలో రాజకీయాలను పక్కన పెట్టి అఖిలపక్ష నాయకులందరం కలిసి పని చేద్దామని ఆయన పిలుపునిచ్చారు.

# శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

## ప్రగతి సింగిడి.. జనంతో మాట.. పల్లె బాట

- ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేరుస్తాం
- సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన
- మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం అండ
- గ్రామాల్లోనే సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం
- చిల్లాపురంలో రెండ్రోజుల పాటు ఎమ్మెల్యే విస్తృత పర్యటన
- ప్రజల సమస్యలను అధికారుల సమక్షంలో నమోదు
- గ్రామంలోనే రాత్రి బస చేసి ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యే
- ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లి గ్రామాల్లోనే సమస్యలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) అన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రగతి సింగిడి.. జనంతో మాట.. పల్లె బాట' కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడ మండలం చిల్లాపురం గ్రామంలో ఎమ్మెల్యే రెండు రోజుల పాటు విస్తృతంగా పర్యటించారు. గ్రామంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, యువత, గ్రామ పెద్దలతో సమావేశమై తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, విద్యుత్, వ్యవసాయం, గృహ నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు తదితర సమస్యలపై చర్చించారు. ప్రజలు నేరుగా వెల్లడించిన సమస్యలను అధికారుల సమక్షంలో నమోదు చేయించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోనే రాత్రి బస చేసిన ఎమ్మెల్యే గ్రామస్తులతో కలిసి భోజనం చేస్తూ వారి జీవన పరిస్థితులు, వ్యవసాయ పరిస్థితులు, ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. శుక్రవారం ఉదయం నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, గ్రామాల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అలాగే వీఓ భవనాన్ని ప్రారంభించి మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..'ప్రగతి సింగిడి.. జనంతో మాట.. పల్లె బాట' కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లి, గ్రామాల్లోనే సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం. చిల్లాపురం గ్రామ ప్రజలు సూచించిన ప్రతి సమస్యను ప్రాధాన్యంతో పరిష్కరిస్తాం. అభివృద్ధి, సంక్షేమం అనే రెండు చక్రాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ప్రతి గ్రామం అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు స్కైలాబ్ నాయక్, గ్రామ సర్పంచ్ మచ్చ మధు, ఎంపీడీవో శ్రీనివాస్ శర్మ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు, యువకులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సచివాలయంలోకి అనుమతికి క్యూఆర్ కోడ్ పెట్టడం దుర్మార్గం

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం సచివాలయంలోకి ప్రవేశం కల్పించడానికి క్యూఆర్ కోడ్ పెట్టడం చాలా దుర్మార్గమైన విషయమని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ యొక్క క్యూఆర్ కోడ్ కేవలం ఒక గంట మాత్రమే అందులో ఉండడానికి అవకాశం కల్పించడం అంటే ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఎంతో మంది సచివాలయంలో పని మీద వస్తారని ఆ సమయంలో వీళ్లు కలవాల్సిన అధికారులు వేరే సమావేశంలో ఉంటే వందల కిలోమీటర్ల నుంచి వచ్చిన వారి పరిస్థితి ఏంటని

లింగం గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇది ప్రజా పాలన కాదు నియంత పాలన అని ధ్వజమెత్తారు. ఇలాంటి తప్పుడు నిర్ణయాలు వెనక్కి తీసుకోవాలని అన్నారు




# అసంపూర్తిగా ఉన్న గాంధీ పార్క్ పాఠశాల భవనాన్ని తక్షణమే పూర్తి చేయాలి..

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలోని గాంధీ పార్క్ పాఠశాలను సర్వే నిర్వహించడం జరిగింది. మన ఊరి మనబడి ప్రణాళికలు భాగంగా నూతన భవనం నిర్మించాలని అమలైన గాంధీ పార్క్ స్కూల్ ను త్వరగా పూర్తి చేయాలని నిరసన కార్యక్రమం నిర్వహించడం

జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి భారత విద్యార్థి ఫెడరేషన్ మిర్యాలగూడ డివిజన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జగన్ సైదా నాయక్ మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణంలో ఆర్డీవో కార్యాలయానికి ఆమడంత దూరంలో ఉన్న పేద విద్యార్థులు చదువుకుంటున్న గాంధీ పార్క్ స్కూల్ ప్రభుత్వానికి,ప్రభుత్వ అధికారులకు కనబడడం లేదా రెండేళ్ల కాల వ్యవధిలో కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాల అభివృద్ధికి తట్టెడు మట్టి పని కూడా చేయలేదన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం గాంధీ పార్క్ పాఠశాల నూతన భవన నిర్మాణానికై ఒక కోటి 86 లక్షల రూపాయలు నిధులను కేటాయించడం జరిగిందన్నారు. కానీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పేద విద్యార్థులు చదువుకుంటున్న పాఠశాల ఇప్పటివరకు పూర్తి చేయకపోవడం పేద విద్యార్థులకు విద్యను దూరం చేయడానికి

నిదర్శనం కావున తక్షణమే ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు ఈ భవనాన్ని త్వరగా పూర్తిచేయాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులను ఏకం చేసి భవనాన్ని నిర్మించేంతవరకు ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బన్నీ,శివ కిరణ్,తరుణ్,లోహి,ఝాన్సీ, ప్రసన్న విద్యార్థులు పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇంట్లో చోరీ..

**ఉండవెల్లి,ఫ్లాష్ ఇండియా :** మండలంలోని పుల్లూరు గ్రామంలో తాళం వేసిన ఇంట్లో కి దొంగలు చొరబడి బంగారం వెండి ఆభరణాలను చోరీ చేసిన ఘటన చోటు చేసుకున్నది. హెడ్ కానిస్టేబుల్ వీరన్న తెలిపిన విరాళాలు ఇలా ఉన్నాయి. పుల్లూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు భార్య భారతితో పాటు ముగ్గురు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. భార్య భారతి నానమ్మ మృతి చెందడంతో ఆమె అస్థికలను కలిపేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపూర్ జిల్లాకు జూన్ 1తేదీన కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లోకి చొరబడి 4.5తులాల బంగారం, ఆరు తులాల వెండి చోరీ చేసినట్లు శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ పేర్కొన్నారు.



# ఐదో రోజుకు చేరిన సింగరేణి అధికారుల నిరాహార దీక్ష..

**యైటింక్లయిన్ కాలనీ,ఫ్లాష్ ఇండియా :** సింగరేణి అధికారుల పే అప్గ్రేడేషన్ను తక్షణమే అమలు చేయడంతో పాటు, పెండింగ్లో ఉన్న పీఆర్పీ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సంస్థ వ్యాప్తంగా సింగరేణి అధికారుల చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష శుక్రవారం ఐదో రోజుకు చేరింది. సంస్థలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు న్యాయబద్ధంగా రావాల్సిన వేతన సవరణ, పీఆర్పీ బకాయిల విషయంలో యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి అవలంబించడం తీవ్ర నిరాశకు గురిచేస్తోందని దీక్షలో పాల్గొన్న అధికారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఉద్యోగుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి కోసం అధికారులు అంకితభావంతో పనిచేస్తున్నప్పటికీ, వారి న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.

**యాజమాన్యం ఇప్పటికైనా స్పందించి...**

పే అప్గ్రేడేషన్ అమలులో జరుగుతున్న జాప్యం వల్ల అధికారులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాగే, చాలా కాలంగా పెండింగ్లో ఉన్న పీఆర్పీ బకాయిలను వెంటనే విడుదల చేసి అధికారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పలుమార్లు విన్నవించినప్పటికి యాజమాన్యం నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ లేకపోవడం వల్లే నిరసనగా నిరాహార దీక్షలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. యాజమాన్యం ఇప్పటికైనా స్పందించి అధికారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కాగా నిరాహార దీక్షకు కూర్చున్న మహిళా అధికారులకు ఏరియాలో వివిధ విభాగాల అధికారుల సతీమణులు సంఘీభావం తెలిపారు. ఎన్. శిరీష డిప్యూటీ ఎఫ్.ఎమ్ (ఎఫ్ ఉ ఏ), ఎన్. రక్షిత సీనియర్ అండర్ మేనేజర్, బి. జీవన్మయి సీనియర్ అండర్ మేనేజర్, బి. సోనియా ఈ.ఈ (సివిల్), టి. హిమ వర్ష ఏ.ఓ (ఎఫ్ ఉ ఏ)లు పాల్గొన్నారు.






# కోహ్లీ రికార్డు బ్రేక్..

ఇంగ్లాండ్‌తో దర్హామ్ వేదికగా జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. ఈ మ్యాచ్ రద్దయినప్పటికీ మొదటి టీ20 మ్యాచ్‌లో భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఇంగ్లాండ్ గడ్డపై టీ20 ఫార్మాట్‌లో హాఫ్ సెంచరీ (అర్ధ శతకం) నమోదు చేసిన మొట్టమొదటి భారత కెప్టెన్‌గా రికార్డు పుస్తకాల్లోకి ఎక్కాడు. సరికొత్త కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత అయ్యర్‌కు ఇదే తొలి అంతర్జాతీయ టీ20 హాఫ్ సెంచరీ కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో అతను 48 బంతుల్లో 68 పరుగులతో కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. అంతేకాదు, ఇంగ్లాండ్ వేదికగా ఓ పురుషుల టీ20 మ్యాచ్‌లో భారత కెప్టెన్‌గా నమోదైన అత్యధిక స్కోరు కూడా ఇదే. ఈ క్రమంలో అతను లెజెండరీ బ్యాటర్ విరాట్ కోహ్లీ పేరిట ఉన్న రికార్డును బ్రేక్ చేశాడు. 2018లో కార్డిఫ్ వేదికగా ఇంగ్లాండ్‌పై కోహ్లీ చేసిన నాటౌట్ 47 పరుగులే ఇప్పటివరకు భారత కెప్టెన్‌కు ఉన్న అత్యధిక స్కోరు. ఇటీవలే ఐర్లాండ్ చేతిలో 0-2తో షాకింగ్ సిరీస్ ఓటమిని చవిచూసిన టీమిండియాను, ఈ మ్యాచ్‌లోనూ ఆరంభంలోనే కష్టాలు చుట్టుముట్టాయి. మొదటి రెండు ఓవర్లలోనే ఓపెనర్లు సంజూ శామ్సన్, ఇషాన్ కిషన్ పెవిలియన్ చేరడంతో భారత్ 6 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి తీవ్ర ఒత్తిడిలో పడింది. ఇలాంటి క్లిష్ట సమయంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ జట్టును ముందుండి నడిపించాడు. మరోవైపు ఓపెనర్ అభిషేక్ శర్మ 27 బంతుల్లోనే 59 పరుగులతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడగా, అయ్యర్ మాత్రం ఆచితూచి ఆడుతూ ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు రికార్డు స్థాయిలో 82 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. మొదట్లో కాస్త ఓపికగా ఆడిన అయ్యర్, ఆ తర్వాత గేర్ మార్చి క్లాస్ బౌండరీలు, ఎక్స్‌ట్రా కవర్ మీదుగా ఒక భారీ సిక్సర్‌తో కేవలం 38 బంతుల్లోనే తన హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత 68 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద సాకిబ్ మహమూద్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూ గా వెనుతిరిగినప్పటికీ, అప్పటికే భారత్‌కు ఓ పటిష్టమైన పునాది లభించింది. చివర్లో శివమ్ దూబే 42 పరుగులతో నాటౌట్‌గా నిలవడంతో భారత్ నిర్ణీత ఓవర్లలో 189/7 పరుగుల భారీ స్కోరు సాధించింది. అయితే, ఆ తర్వాత ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం కారణంగా ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ ప్రారంభం కాలేదు. దీంతో మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. మ్యాచ్ ఫలితం తేలనప్పటికీ, మంచెస్టర్‌లో జరగబోయే రెండో టీ20 మ్యాచ్‌కు ముందు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తిరిగి ఫామ్‌లోకి రావడం, ఒక అరుదైన మైలురాయిని అందుకోవడం భారత జట్టుకు ఓ పెద్ద సానుకూలాంశం అని చెప్పాలి.



# ఫైనల్స్ కు దూసుకెళ్లిన ఇంగ్లాండ్

ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ లో ఫైనల్స్ లో అడుగు పెట్టింది ఇంగ్లాండ్. గురువారం దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ మధ్య రెండో సెమీ ఫైనల్ జరిగింది. ఇందులో అద్భుతంగా రాణించిన ఇంగ్లాండ్... దక్షిణాఫ్రికాపై 40 పరుగుల తేడాతో విక్టరీ అందుకుంది. ఈ మ్యాచ్ లో ఇంగ్లాండ్ మొదట బ్యాటింగ్ చేసింది. ఈ నేపథ్యంలో ఐదు వికెట్ల నష్టానికి 169 పరుగులు సాధించింది. అయితే ఛేదనలో దక్షిణాఫ్రికా చేతులెత్తేసింది. ఈ క్రమంలో 129 పరుగులు చేసి ఎనిమిది వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా, ఓటమిపాలైంది. ఈ క్రమంలో ఫైనల్స్ లో ఇంగ్లాండ్ అడుగుపెట్టింది. ఈనెల 5వ తేదీన ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా మధ్య ఫైనల్స్ ఉండనుంది. కాగా టీ20 వరల్డ్ కప్ లో అత్యధిక సార్లు ఫైనల్ కు చేరిన రెండో జట్టుగా ఇంగ్లాండ్ నిలిచింది. అటు రెండో సెమీ ఫైనల్ లో ఓడిపోయిన దక్షిణాఫ్రికా ఇంటి దారి పట్టింది.

# ఇండియా, శ్రీలంక టెస్ట్ సిరీస్ షెడ్యూల్ రిలీజ్




ఐపీఎల్ 2026 లీగ్ పూర్తయిన తర్వాత భారత జట్టు ఫుల్ బిజీగా మారిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆఫ్ఘనిస్తాన్ తో సిరీస్ ఫినిష్ చేసిన భారత్, మొన్నటికి మొన్న ఐర్లాండ్ తో తలపడింది. ప్రస్తుతం ఇంగ్లాండ్ తో టీ20 సిరీస్ ఆడుతోంది. ఇలాంటి క్రమంలో భారత్, శ్రీలంక మధ్య టెస్ట్ సిరీస్ షెడ్యూల్ కూడా తాజాగా రిలీజ్ అయింది. ఇంగ్లాండ్ సిరీస్ తర్వాత నేరుగా శ్రీలంక టూర్ వెళ్లనుంది భారత్. భారత్ తో జరిగే రెండు టెస్టుల షెడ్యూల్ ను తాజాగా రిలీజ్ చేసింది శ్రీలంక క్రికెట్ బోర్డు. తొలి టెస్ట్ గాలే లో ఆగస్టు 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు కొనసాగనుంది. రెండు టెస్ట్ కొలంబోలో ఆగస్టు 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరుగుతుంది. ఉదయం 10 గంటలకు ఈ సిరీస్ లోని మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. 2025-27 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ సైకిల్ లో భారత్ కు ఈ సిరీస్ చాలా కీలకం కానుంది.

# అసలు కారణం ఇదే!






15 ఏళ్ల వయసులోనే ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించిన వైభవ్ సూర్యవంశీ.. ఇంకా భారత జట్టు తరఫున అరంగేట్రం చేయకపోవడం సోషల్ మీడియాలో పెద్ద చర్చగా మారింది. ఐపీఎల్ 2026లో అద్భుత ప్రదర్శనతో రికార్డులు బద్దలు కొట్టిన బుడ్డోడికి.. ఐర్లాండ్, ఇంగ్లండ్ సిరీస్‌ల్లో వరుసగా మూడు మ్యాచ్‌ల్లో అవకాశం రాకపోవడంతో అభిమానులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే టీమిండియా మేనేజ్‌మెంట్ మాత్రం అతడికి ఉద్దేశపూర్వకంగానే ఛాన్స్ ఇవ్వడం లేదని తెలుస్తోంది. దీనికి ప్రధాన కారణం 'హెయిరార్కీ' (జట్టు క్రమశిక్షణ, సీనియారిటీ వ్యవస్థ) అని సమాచారం.

**జట్టు హెయిరార్కీని దెబ్బతీయొద్దనే నిర్ణయం:**

భారత క్రికెట్‌లో దేశవాళీ నుంచి జాతీయ జట్టుకు చేరే సంప్రదాయ వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈ క్రమంలోనే కేవలం 15 ఏళ్ల ఆటగాడిని నేరుగా సీనియర్ జట్టులోకి తీసుకురావడం జట్టు నిర్మాణాన్ని ప్రభావితం చేస్తుందని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. 15 ఏళ్ల ఆటగాడిని నేరుగా జట్టులోకి తీసుకురావడం మిగతా ఆటగాళ్లకు తప్పుడు సంకేతాలు పంపే అవకాశం ఉందని కూడా భావిస్తున్నట్లు తెలుస్తోంది. గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని కోచింగ్ స్టాఫ్ జట్టులో ఏర్పాటైన క్రమశిక్షణ, ఆటగాళ్ల మధ్య ఉన్న సమతౌల్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతోనే వైభవ్ అరంగేట్రాన్ని ఆలస్యం చేస్తున్నట్లు తెలుస్తోంది.

**వరల్డ్‌కప్ హీరోలపై పూర్తి నమ్మకం:**

అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ వంటి ఆటగాళ్లు భారత్‌కు టీ20 ప్రపంచకప్ 2026 అందించడంలో కీలక పాత్ర పోషించారు. ఒకటి రెండు మ్యాచ్‌ల్లో విఫలమైనంత మాత్రాన వారిపై నమ్మకం కోల్పోవద్దని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. భవిష్యత్ టోర్నీలను దృష్టిలో పెట్టుకుని ఈ ఆటగాళ్లకు పూర్తి భరోసా ఇవ్వాలని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ బృందం నిర్ణయించింది. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగానే ఇప్పటికే జట్టులో ఉన్న సీనియర్ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే వైభవ్ అరంగేట్రం ఆలస్యం అవుతోందని సమాచారం.

**వైభవ్ కోసం ప్రపంచం ఎదురుచూపులు:**

వైభవ్ సూర్యవంశీ ప్రభావం భారత క్రికెట్‌కే పరిమితం కాలేదు. ఐర్లాండ్‌లో కూడా బుడ్డోడి ఆట కోసం ఫాన్స్ ఎగబడ్డారు. టికెట్స్ హాట్ కేకుల్లా అమ్ముడవడంతో స్టేడియం సామర్థ్యాన్ని పెంచేందుకు తాత్కాలిక సీట్లు ఏర్పాటు చేయాల్సి వచ్చింది. అయితే వైభవ్ ఆడకపోవడం కాస్త నిరాశ కలిగించింది. తొలి బంతినే సిక్సర్ కొట్టే సామర్థ్యం ఉన్న ఆటగాడని.. ఇంగ్లండ్ బౌలర్లను అప్రమత్తం చేశారు. కానీ ఇప్పటివరకు వైభవ్ డ్రింక్స్ మోయడం, బెంచ్‌పైనే కూర్చోవడం అభిమానులను నిరాశపరుస్తోంది.

**గంభీర్ మేనేజ్‌మెంట్ స్పష్టమైన వ్యూహం:**

భారత సహాయ కోచ్ ర్యాన్ టెన్ దస్కటే కూడా వైభవ్ అంతర్జాతీయ క్రికెట్‌కు పూర్తిగా సిద్ధంగా ఉన్నాడని అంగీకరించాడు. అయితే వరల్డ్‌కప్ గెలిపించిన సంజూ శాంసన్ వంటి ఆటగాళ్లను ఒక్కసారిగా పక్కన పెట్టడం సరైన నిర్ణయం కాదని స్పష్టం చేశాడు. కొత్త టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. ఆటగాళ్లకు భద్రత, నమ్మకం కల్పించడం కూడా మేనేజ్‌మెంట్ బాధ్యత అని పేర్కొన్నాడు. వరల్డ్‌కప్ గెలిచిన ఆటగాళ్లను మద్దతు ఇవ్వడం చాలా ముఖ్యం అని శ్రేయస్ తెలిపాడు.

**రెండో టీ20పై అందరి దృష్టి:**

మరోవైపు భారత క్రికెట్ దిగ్గజాలు సునీల్ గవాస్కర్, రవిశాస్త్రి మాత్రం వైభవ్‌కు వెంటనే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంగ్లండ్‌తో తొలి టీ20 వర్షం కారణంగా రద్దు కావడంతో ఇప్పుడు రెండో మ్యాచ్‌పై ఆసక్తి నెలకొంది. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో బెంచ్‌కే పరిమితమైన సూర్యవంశీకి ఈసారి అయినా అరంగేట్రం చేసే అవకాశం దక్కుతుందా? లేక టీమిండియా మేనేజ్‌మెంట్ మరోసారి హెయిరార్కీకే ప్రాధాన్యం ఇస్తుందా? అన్నది ఇప్పుడు అభిమానులందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రశ్న.

# బిజినెస్




## మరోసారి లక్షన్నరకు చేరువ


వరుసగా మూడు రోజుల్లో తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు గురువారం నుంచి షాక్ ఇస్తున్నాయి. వరుసగా రెండో రోజు భారీగా ధరలు పెరగడంతో భాగ్యనగర బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు సరికొత్త రికార్డులను సృష్టించాయి. తాజాగా పెరిగిన ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో దేశీయంగా పసిడి ధరలు మునుపెన్నడూ లేని విధంగా ఒకేసారి భారీగా పెరిగాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల (తులం) మేలిమి బంగారం ధర ఏకంగా రూ. 3,220 పెరిగి రూ. 1,47,000 మార్కుకు చేరింది. దీంతో గడిచిన కేవలం రెండు రోజుల్లోనే పసిడి ధర ఏకంగా రూ. 6,220 పెరగడం గమనార్హం. ఇదిలా ఉంటే ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ. 2,950 ఎగబాకి ప్రస్తుతం రూ. 1,34,750 పలుకుతోంది. పసిడి బాటలోనే వెండి కూడా భారీ పరుగులు పెట్టింది. పరిశ్రమల నుంచి డిమాండ్ పెరగడంతో కేజీ వెండి ధర ఒకే రోజు ఏకంగా రూ. 10,000 పెరిగి రూ. 2,60,000 కి చేరుకుంది. అయితే స్థానిక ట్యాక్సులు, నగల దుకాణాల మేకింగ్ ఛార్జీలను బట్టి నగరంలోని వివిధ ప్రాంతాలలో ధరల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చని వ్యాపారులు చెబుతున్నారు.

# గూగుల్‌కు యూరప్ కోర్టులో భారీ ఎదురుదెబ్బ




ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను ఉపయోగించి తన ఆధిపత్యాన్ని దుర్వినియోగం చేసిందన్న కేసులో గూగుల్‌కు యూరప్‌లో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న ఈ న్యాయపోరులో యూరోపియన్ యూనియన్ అత్యున్నత న్యాయస్థానం గూగుల్ అప్పీల్‌ను తిరస్కరిస్తూ, కంపెనీపై విధించిన 4.1 బిలియన్ యూరోల (మన కరెన్సీలో సుమారు రూ.40 వేల కోట్లకు పైగా) జరిమానాను ఖరారు చేసింది. 2018లో యూరోపియన్ కమిషన్ తొలుత 4.34 బిలియన్ యూరోల జరిమానా విధించగా, 2022లో దిగువ కోర్టు దాన్ని 4.1 బిలియన్ యూరోలకు తగ్గించింది. అయితే ఆ నిర్ణయాన్ని కూడా గూగుల్ సవాలు చేయగా, ఇప్పుడు అత్యున్నత కోర్టు కమిషన్ నిర్ణయానికే మద్దతు ఇచ్చింది. ఆండ్రాయిడ్ ఫోన్లలో గూగుల్ సెర్చ్, క్రోమ్ బ్రౌజర్, గూగుల్ ప్లే స్టోర్‌ను ముందుగానే ఇన్‌స్టాల్ చేయాలని ఫోన్ తయారీదారులను ఒప్పందాల ద్వారా బలవంతం చేయడం, ప్రత్యామ్నాయ ఆండ్రాయిడ్ ప్లాట్‌ఫామ్‌లకు అవకాశాలను పరిమితం చేయడమే ఈ కేసులో ప్రధాన ఆరోపణ. తీర్పుపై స్పందించిన గూగుల్, ఆండ్రాయిడ్‌ను ఓపెన్, ఉచిత, అందరికీ అందుబాటులో ఉండే ప్లాట్‌ఫామ్‌గా అభివృద్ధి చేయడానికి తాము చేసిన పెట్టుబడులను కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని పేర్కొంది. అయితే 2018లో వచ్చిన యూరోపియన్ కమిషన్ నిర్ణయం తర్వాత తమ వ్యాపార ఒప్పందాలను ఇప్పటికే సవరించామని, వినియోగదారులు, భాగస్వాములు, డెవలపర్ల కోసం కొత్త ఆవిష్కరణలపై దృష్టి కొనసాగిస్తామని తెలిపింది. గత దశాబ్దంలో వివిధ యాంటీట్రస్ట్ కేసుల్లో గూగుల్‌పై దాదాపు 11 బిలియన్ యూరోల జరిమానాలు విధించిన యూరోపియన్ యూనియన్, బిగ్ టెక్ కంపెనీలపై మరింత కఠిన వైఖరిని కొనసాగిస్తోంది.

# గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయంటే?



ఈ నెల ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరల పై కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. హోటళ్లు, రెస్టారెంట్లు, టీ స్టాల్స్ తదితర వ్యాపారులకు ఊరటనిస్తూ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించింది. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.183 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.3,191గా ఉంది. ఇక, గృహ వినియోగ ఎల్‌పిజి ధరల్లో ఎలాంటి మార్పులు లేవు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.

**నేటి గ్యాస్ సిలిండర్ ధరలు..**

హైదరాబాద్: రూ.994.00
వరంగల్: రూ.1013.00
విశాఖపట్నం: రూ.950.00
విజయవాడ: రూ.966.50
గుంటూరు: రూ.966.50




# పెట్రోల్ ధరలు తగ్గిస్తాం.. కానీ..!

దేశంలో పెరిగిన ఇంధన ధరల తగ్గింపుపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ కీలక వ్యాఖ్యలు చేసారు. ఓ సమావేశంలో విలేకరులు దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను ఎప్పుడు తగ్గిస్తారని ప్రశ్నించగా, కేవలం కొన్ని రోజుల పాటు ముడి చమురు ధరలు తగ్గగానే దేశీయంగా రిటైల్ ధరలను తగ్గించడం సాధ్యం కాదని, రాబోయే కొన్ని వారాల పాటు అంతర్జాతీయంగా ఈ తక్కువ ధరలు నిలకడగా కొనసాగినప్పుడు మాత్రమే ధరల తగ్గింపు కుదురుతుందని ఆయన స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో అమెరికా-ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గడంతో అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు గణనీయంగా క్షీణించాయి. భారతదేశం దిగుమతి చేసుకునే ముడి చమురు ధర కొన్ని సందర్భాల్లో బ్యారెల్‌కు 70 డాలర్ల కంటే తక్కువకు పడిపోవడం వినియోగదారుల్లో ఆశలు రేకెత్తించినప్పటికీ, తక్షణమే దేశంలో ఇంధన ధరలు తగ్గకపోవడానికి వెనుక బలమైన ఆర్థిక కారణాలు ఉన్నాయి. ప్రస్తుతం ముడి చమురు ధరలు సానుకూలంగా ఉన్నప్పటికీ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ , భారత్ పెట్రోలియం , మరియు హిందుస్తాన్ పెట్రోలియం వంటి ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు ఇంకా పాత ధరలనే కొనసాగిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం గతంలో అంతర్జాతీయంగా ధరలు విపరీతంగా పెరిగినప్పుడు, దేశీయంగా ప్రజలపై భారం పడకుండా ఉండేందుకు ఈ కంపెనీలు నష్టాలను భరిస్తూ స్థిరమైన ధరలకే ఇంధనాన్ని సరఫరా చేశాయి. ఆ కాలంలో పేరుకుపోయిన పాత నష్టాలు జూన్ 30 నాటికి సుమారు రూ.74,781 కోట్లుగా ఉన్నాయి. కాబట్టి, ప్రస్తుత తక్కువ ధరల కాలంలో లభిస్తున్న లాభాలను ఉపయోగించుకుని చమురు సంస్థలు ముందుగా ఆ భారీ నష్టాలను భర్తీ చేసుకోవాల్సి ఉంది. నయారా ఎనర్జీ వంటి కొన్ని ప్రైవేట్ చమురు కంపెనీలు మార్కెట్ పోటీని తట్టుకోవడానికి కొంతమేర ధరల తగ్గింపును ప్రకటించినప్పటికీ, దేశవ్యాప్తంగా మెజారిటీ సరఫరాను నియంత్రించే ప్రభుత్వ రంగ సంస్థలు మాత్రం ఇంకా ఎలాంటి మార్పులు చేయలేదు. రాబోయే రెండు నుండి మూడు నెలల పాటు అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ధరలు ఇలాగే తక్కువ స్థాయిలో స్థిరంగా కొనసాగితేనే, ప్రభుత్వ రంగ సంస్థల ఆర్థిక పరిస్థితి మెరుగై సామాన్య ప్రజలకు రిటైల్ ధరల్లో ఉపశమనం లభించే అవకాశం ఉంటుంది.

## రెచ్చిపోయిన పాయల్ రాధాకృష్ణ




అందాల భామ పాయల్ రాధాకృష్ణ తెలుగు, తమిళ్, కన్నడ చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. ఇటీవల ఈ బ్యూటీ 'పాపం ప్రతాప్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.మంచి అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ప్రేక్షకాదరణ పొందలేకపోయింది. మోడలింగ్ రంగం నుంచి సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన పాయల్, సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్‌గా ఉంటుంది.తరచూ తన గ్లామరస్ ఫొటోషూట్‌లతో అభిమానులను ఆకట్టుకుంటూ నెట్టింట సందడి చేస్తుంటుంది. తాజాగా ఈ చిన్నది తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసిన ఫొటోలు వైరల్‌గా మారాయి.ఈ ఫొటోల్లో పాయల్ తన ఎద, నడుము అందాలు హైలైట్ అయ్యేలా స్టైలిష్ పోజులతో మెస్మరైజ్ చేసింది. మెడలో అందమైన హారం, పెద్ద ఇయర్‌రింగ్స్, చేతులకు ట్రెండీ గాజులు ధరించి క్యూట్ స్మైల్‌తో కెమెరాకు పోజులిచ్చింది.ఓవరాల్‌గా పాయల్ స్టైలిష్ లుక్ అభిమానులను ఫిదా చేస్తుండగా, ఈ గ్లామరస్ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## విశ్వంభర రిలీజ్ డేట్ ఫిక్స్.. ఎప్పుడంటే?




ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉన్న మెగాస్టార్ చిరంజీవి 'విశ్వంభర' సినిమా ఎఖీశ వర్క్స్ కారణంగా కొంత డిలే అవుతూ వస్తోంది. ఒక రకంగా చెప్పాలంటే, 'గేమ్ చేంజర్' సినిమాతో సమానంగా అంటే కొంచెం అటు ఇటుగా రిలీజ్ కావాల్సి ఉన్న సినిమా ఇది. ఎఖీశ వర్క్స్ పర్ఫెక్ట్ అయ్యాకే రిలీజ్ డేట్ ప్రకటిద్దామని ఇప్పటివరకు ఆగుతూ వచ్చారు.వశిష్ఠ దర్శకత్వంలో సోషల్ ఫాంటసీ మూవీగా రూపొందిన ఈ సినిమా మీద టాలీవుడ్ ట్రేడ్ వర్గాల్లో మంచి ఆసక్తి ఉంది. దానికి తోడు మెగాస్టార్ చిరంజీవి క్రేజ్, ఆయన గతంలో చేసిన ఇలాంటి సినిమాల అనుభవాల నేపథ్యంలో, ఈ సినిమా ఎలా ఉంటుంది అని ఫ్యాన్స్ తో పాటు టాలీవుడ్ ప్రేక్షకులు అందరూ ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు.ఇక తాజాగా టాలీవుడ్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు, ఈ సినిమాని ఈ ఏడాది దసరా సందర్భంగా అక్టోబర్ 16వ తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు ప్లాన్ చేస-త్తున్నారు మేకర్స్. ఈ సినిమాని వశిష్ఠ డైరెక్ట్ చేయగా, యూవీ క్రియేషన్స్ బ్యానర్ మీద ప్రభాస్ సన్నిహితులు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. మొత్తానికి చాలా కాలం నుంచి వాయిదా పడుతూ వస్తున్న సినిమా, ఎట్టకేలకు ఈ దసరాకి ప్రేక్షకుల ముందుకు రానున్నదన్న మాట!




## నాని 'ది ప్యారడైజ్' రిలీజ్ డేట్ ఫిక్స్..

నేచురల్ స్టార్ నాని కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ప్యారడైజ్'. దసరా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా ఈ సినిమాపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆ మధ్య రిలీజ్ చేసిన గ్లిమ్స్ తో సెన్సేషన్ క్రియేట్ చేసింది ప్యారడైజ్. అయితే ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని ఈ ఏడాది ఆగస్టు 21న విడుదల చేయాలని చిత్ర బృందం భావించింది. కానీ షూటింగ్ పెండింగ్ కారణంగా పోస్ట్ పోన్ అయింది.నెక్ట్స్ రిలీజ్ ఎప్పుడనేదానిపై ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదు మేకర్స్. అయితే 'ది ప్యారడైజ్' రిలీజ్ డేట్‌పై ఓ వ ర్సీ స్ డిస్ట్రిబ్యూటర్స్ కు ఒక కీలక అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ చిత్రాన్ని ఈ ఏడాది సెప్టెంబర్ 25 శుక్రవారం నాడు ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా విడుదల చేయడానికి చిత్ర బృందం ప్లాన్ చేస్తుందట. దీనికి ఒక రోజు ముందే అంటే సెప్టెంబర్ 24 గురువారం నాడే భారీ సా-ధయిలో ప్రీమియర్ షోస్ ప్లాన్ చేస్తున్నారు. ఈ మేరకు సినిమాకు సంబంధించిన ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్లందరికీ 'ది ప్యారడైజ్' టీమ్ ముందస్తు సమాచారాన్ని అందించింది. రిలీజ్ కు కావాల్సిన ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాల్సిందిగా కోరింది. అయితే చిత్రానికి సంబంధించి మిగిలి ఉన్న పనులన్నీ అనుకున్న సమ-యానికి పూర్తయితేనే ఈ తేదీల్లో సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండటంతో మేకర్స్ ప్లాన్ చేసినట్లుగానే సెప్టెంబర్ 25న థియేటర్లలో ఈ సినిమా సందడి చేయడం ఖాయంగా కనిపిస్తోంది.



## 'జైలర్ 2' రిలీజ్ డేట్ కన్ఫామ్..

తొలి భాగం సాధించిన విజయంతో 'జైలర్ 2'పై భారీ అంచనాలు నెలకొన్నాయి.ఈ ఏడాది ఏప్రిల్‌లోనే సినిమా షూటింగ్ పూర్తయినట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. షూటింగ్ ముగిసిన సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు కూడా నిర్వహించారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన రజనీకాంత్.. సినిమా ఫైనల్ దశలో ఉందని, విడుదల తేదీని నిర్మాతలు త్వరలో ప్రకటిస్తారని వెల్లడించారు. ఇప్పుడు అధికారికంగా అక్టోబర్ 15 తేదీని ఖరారు చేశారు. ఈ సీక్వెల్‌లో రజనీకాంత్‌తో పాటు ప్రముఖ నటి రమ్య కృష్ణన్ మరోసారి విజయ పాండియన్ పాత్రలో కనిపించనున్నారు. అలాగే నటి మీరేనా కూడా కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. మరోవైపు మలయాళ సూపర్ స్టార్ మోహన్లాల్, తమిళ స్టార్ నటుడు విజయ్ సేతుపతి కూడా చిత్రంలో ముఖ్య పాత్రల్లో కనిపించనున్నట్లు సినీ వర్గాల టాక్.జైలర్ మొదటి భాగం విజయంలో సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ సంగీతం కీలక పాత్ర పోషించింది. పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ తో సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇప్పుడు 'జైలర్ 2'కు కూడా అనిరుధ్ సంగీతం అందిస్తుండటంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. అక్టోబర్ 15న దసరా సీజన్‌ను లక్ష్యంగా చేసుకుని విడుదలవుతున్న 'జైలర్ 2' బాక్సాఫీస్ వద్ద ఈసారి ఎలాంటి రికార్డ్స్ క్రియేట్ చేస్తుందో చూడాలిమరి.

## ఆ టాలీవుడ్ హీరో నటన అద్భుతం..

క్రేజీ హీరోయిన్ పూజా హెగ్డే ఇప్పటికే పలువురు టాలీవుడ్ స్టార్ హీరోలతో కలిసి నటించి ఎన్నో విజయాలను తన ఖాతాలో వేసుకుంది. తెలుగు చిత్రాల్లో మంచి క్రేజ్ సంపాదించుకున్న సమయంలోనే తమిళం, హిందీ చిత్రాలపై కూడా దృష్టి సారించింది. ఇక తాజాగా ఓ టాలీవుడ్ హీరో నటనపై ఆమె ప్రశంసల వర్షం కురిపించింది. పూజా హెగ్డే మాట్లాడుతూ.. "నాని హీరోగా నటించిన 'నిన్ను కోరి' సినిమా నాకు చాలా ఇష్టం. ఆ చిత్రంలో నాని నటన అద్భుతంగా ఉంటుంది. ముఖ్యంగా ఆయన నటన నన్నెంతో ఆకట్టుకుంది" అని తెలిపింది.ఇప్పటివరకు పూజా హెగ్డే పలువురు టాలీవుడ్ స్టార్ హీరోలతో నటించినప్పటికీ, నానితో మాత్రం ఒక్క సినిమా కూడా చేయలేదు. దీంతో నాని నటనను ఇంతగా ప్రశంసించడంతో వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా వచ్చే అవకాశాలపై ఇండస్ట్రీలో చర్చ మొదలైంది. ప్రస్తుతం నాని 'ది ప్యారడైజ్' చిత్రంలో నటిస్తుండగా, త్వరలోనే 'బ్లడీ రోమియో' సినిమాను ప్రారంభించనున్నాడు. మరోవైపు పూజా హెగ్డే వరుస సినిమాలతో ప్రేక్షకులను పలకరిస్తున్నప్పటికీ ఇటీవల కాలంలో ఆమెకు ఆశించిన స్థాయి విజయం మాత్రం దక్కలేదు.



## ఐడెంటిటీ కోల్పోతున్న శృతి హాసన్



శంతను హాజారికాతో నాలుగేళ్ల ప్రేమకు బ్రేకప్ చెప్పిన శృతి హాసన్.. మళ్లీ యాక్టింగ్‌పై సీరియస్‌గానే ఫోకస్ చేసింది. కానీ మునుపటిలా మెరుపులు చూపించడం లేదు. చేస్తున్న సినిమాలలో కూడా తనకంటే పక్క హీరోయిన్స్ కె ఎక్కువ గుర్తింపు వస్తుంది. రజనీకాంత్ నటించిన కూలీలో హీరోయిన్ శృతినే అయినప్పటికీ క్రెడిట్ మొత్తం కొట్టేసింది పూజా హెగ్డే. మెనికా బెలూచి అంటూ మూడు నిమిషాల పాటు ఐటమ్ సాంగ్‌లో చిందులేసి ఆడియన్స్ దిల్ దోచేసింది బుట్టబొమ్మ.పెద్దిలో ఐటమ్ సాంగ్ చేసింది అన్నమాటే కానీ ఎక్కడా శృతి హాసన్ పేరు పెద్దగా డిస్కర్షన్‌లో నిలిచినట్లు లేదు. పెప్ సాంగ్‌లో కూడా జాన్వీ స్టీల్ ద ఫెర్ఫామెన్స్ కాబట్టి.. శృతికి సరైన ఐడెంటిటీ దక్కలేదు. జాన్వీపై వచ్చిన నెగిటివిటీ కూడా శృతి స్పెషల్ సాంగ్ చేసిందన్న విషయం ఆడియన్స్‌కు కనెక్ట్ కాలేదు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఫోటో షూట్స్‌తో బిజీగా గడుపుతోన్న శృతి హాసన్ చేతిలో టూ, త్రీ ప్రాజెక్ట్స్ ఉన్నాయి. విజయ్ సేతుపతి హీరోగా ఎప్పుడో కంప్లీటైన థియేటర్స్‌లో రావడానికి మీన మేషాలు లెక్కిస్తోంది. ఇక సలార్2 ఇప్పట్లో పట్టాలెక్కే ఛాన్స్ లేదు. ఆకాశంలో ఓ తారలో డిఫరెంట్ రోల్‌లో మెరవబోతుంది కమల్ డాటర్. మరీ ఈ మూవీ అయినా తనతో పాటు ఆడియన్స్‌కు గుర్తుండిపోయే రోల్ అవుతుందో లేదో చూడాలి. అన్నట్టు అడివి శేష్ హీరోగా వచ్చిన డెకాయిట్ లోను మొదట హీరోయిన్ గా శృతి హాసన్ ను తీసుకున్నారు కానీ క్రియేటివ్ డిఫరెన్సెస్ కారణంగా ఈ సినిమా నుండి వైదొలిగింది.



## ఆమె ఆలోచలన్నీ వేరు

పార్వతి కేవలం నటనకు మాత్రమే పరిమితం కాకుండా, సినిమాను చాలా లోతుగా అర్థం చేసుకునే ఒక తెలివైన నటి అని పృథ్వీరాజ్ కొనియాడారు.ఆమె ఒక కథను ఎంచుకునేటప్పుడు అందులో తన పాత్ర ఎంత పెద్దది అని మాత్రమే చూడరని, ఆ కథకు ఒక మంచి సినిమాగా మారే సత్తా ఉందా లేదా అని ఆలోచిస్తారని చెప్పారు. ఆ సినిమాలో తాను భాగం కావడం వల్ల ఆ చిత్రానికి మరింత బలం చేకూరుతుందని ఆమె నమ్ముతారని పృథ్వీరాజ్ వివరించారు. పార్వతి క్రియేటివ్ ఆలోచనలపై తనకు పూర్తి నమ్మకం ఉందని పృథ్వీరాజ్ చెప్పారు. తనకు ఆమె చాలా కాలంగా తెలుసని, సినిమాపై ఆమెకున్న అవగాహన చూస్తుంటే భవిష్యత్తులో ఆమె ఒక అద్భుతమైన దర్శకురాలవుతుందని తాను ఖచ్చితంగా నమ్ముతున్నానని అన్నారు. చాలా ఏళ్లుగా కలిసి నటిస్తున్న వీరిద్దరి మధ్య ఉన్న పరస్పర గౌరవం, స్నేహం పృథ్వీరాజ్ మాట్లాడిన మాటల్లో స్పష్టంగా కనిపించింది. అయితే ఈ సినిమాతో పాటు పార్వతి బాలీవుడ్ స్టార్ హృతిక్ రోష-న్‌తో కలిసి అమెజాన్ ప్రైమ్ నిర్మిస్తున్న 'స్టార్మ్' అనే సిరీస్‌లో కూడా నటిస్తున్నారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**